




# విజయభాను








విజయవాడ, బుధవారం 11-10-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 128 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## లోటుబడ్జెట్ ఉన్నప్పటికీ మాటనిలబెట్టుకున్నారు

- పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం
- మంత్రి పరిటాల సునీత



పెనుకొండ: తెదేపా ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. పెనుకొండలోని షాదీమహాల్‌లో రైతు రుణమాఫీ ఉపశమన పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మొదటి, రెండో విడతలో రుణమాఫీ పూర్తి కాగా, రాష్ట్ర వ్యాప్తంగా మూడో విడతలో 36.72 లక్షల మంది రైతులకు రూ.3600 కోట్లు రుణమాఫీ చేశారని తెలిపారు. అనంతపురం జిల్లాకు 5.48 లక్షల మంది రైతులకు రూ.502.42 కోట్లు రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. దీనికితోడు ఇటీవల ఇన్‌పుట్ సబ్సీడీని, వాతవరణ భీమాను రైతులకు విడివిడిగా అందించిన ఘనత ముఖ్యమంత్రిదేనని తెలిపారు. రైతులకు పారదర్శకంగా ఎరువులు, విత్తనాలు అందాలని ముఖ్యమంత్రి బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేసి సక్రమంగా అందేలే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు, సాధారణ మరణం జరిగితే రూ.రెండు లక్షలు మృతుల కుటుంబాలకు అందేలా చంద్రన్న బీమా పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఇంటింటికి తెదేపా కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి తరువాయి 2లో

## ఐటిలో ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- 2019 నాటికి ఐటీలో లక్ష
- ఎలక్ట్రానిక్ రంగంలో 2 లక్షల ఉద్యోగాలు
- కొత్తటెక్నాలజీ ఏదివచ్చినా విశాఖకే ముందు
- ఐటీ మంత్రి నారా లోకేష్



విశాఖపట్నం సిటీ: 2019 నాటికి ఐటీలో లక్ష, ఎలక్ట్రానిక్ రంగంలో 2 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళవారం విశాఖలో పర్యటిస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బ్లాక్ చైన్ టెక్నాలజీ వాడితే ఫండమెంట్ సేఫ్టీ సెక్యూరిటీ ఉంటుందని అన్నారు. దీనికి సంబంధించి అనేక సంస్థలతో చర్చలు జరిపామని, రాబోయే 15, 20 రోజుల్లో ప్లాన్ చేస్తామని మంత్రి తెలిపారు. నిన్ననే ఓ కంపెనీ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందని, అందులో 5వేల ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని లోకేష్ వెల్లడించారు. విశాఖ పట్టణానికి మంచి ట్రాక్ ఉందని ఆంధ్రప్రదేశ్‌కు 10 ఉద్యోగాలు వస్తే అందులో 6 ఉద్యోగాలు విశాఖ ఐటీ రంగానికి రావడానికి అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. ప్రపంచంలో కొత్త టెక్నాలజీ ఏది వచ్చినా మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని, టెక్నాలజీ ఎక్కువగా ఆడాప్ట్ చేసుకుంటున్న ఆంధ్ర రాష్ట్రానికే బ్లాక్ చైన్ టెక్నాలజీ అవసరమని అన్నారు. తిరుపతిలో ఎక్కువ కంపెనీలు తరువాయి 2లో



## 300 మంది చిన్నారులకు అస్వస్థత

షమ్లీ: పాఠశాలకు సమీపంలోని చక్కెర కర్మాగారం నుంచి వెలువడిన రసాయనాల కారణంగా 300 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని షమ్లీలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక సరస్వతి శిశు మందిర్‌కు సమీపంలో ఓ చక్కెర కర్మాగారం ఉంది. మంగళవారం పాఠశాల తెరిచే సమయంలో ఫ్యాక్టరీ నుంచి వచ్చిన వ్యర్థాలను అక్కడ పనిచేసే సిబ్బంది తగలబెట్టారు. దీంతో రసాయనాల నుంచి వెలువడిన వాసనకు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు.

కొందరు చిన్నారులు స్పృహ కోల్పోగా.. మరికొందరు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడ్డారు. కొందరు చిన్నారులకు వికారంగా ఉండటం, తలతిరగడం, కడుపునొప్పి, తరువాయి 2లో

## నవంబర్ 2 నుంచి పాదయాత్ర ప్రారంభిస్తా

- ప్రత్యేక హోదా సాధిస్తాం
- బాబు ముఖం చూసి ఎవరూ పరిశ్రమలు పెట్టరు
- చివరి అస్త్రంగా ఎంపీలతో రాజీనామా
- అనంతపురం యువభేరిలో జగన్




అనంతపురం: నవంబర్ 2వతేదీ నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక హోదా కోరుతూ అనంతపురంలో జరిగిన యువభేరి కార్యక్రమంలో పాల్గొన్న జగన్ ప్రసంగిస్తూ... ఇడుపుల పాయ నుంచి ఇచ్చాపురం వరకు పాదయాత్ర నిర్వహిస్తానన్నారు. 6 నెలల పాటు 3 వేల కిలోమీటర్లు పాదయాత్ర ఉంటుందన్నారు. అలాగే... దాని కోసం అన్ని నియోజకవర్గాల్లో యువభేరి సభలు జరుగుతాయన్నారు. నేను మాట్లాడితేనే ప్రత్యేక హోదా తెరపైకి వస్తోందని, ప్రత్యేక హోదా సాధన కోసం యువత కలిసిరావాలని జగన్ పిలుపునిచ్చారు. కాగా... చివరి అస్త్రంగా ఎంపీలతో రాజీనామా చేయిస్తామని జగన్ తెలిపారు.

**బాబు ముఖం చూసి ఎవరూ పరిశ్రమలు పెట్టరు**

చంద్రబాబునాయుడు సుందర ముఖం చూసి ఏపీలో పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ రారని వైసీపీ అధినేత వైఎస్ తరువాయి 2లో

## బీసీలకు చంద్రన్న పెళ్లి కానుక



అమరావతి: బీసీ సామాజిక వర్గంలో పెళ్లి చేసుకునే పేద వధూవరులకు ఏపీ ప్రభుత్వం ఇకపై చంద్రన్న పెళ్లి కానుక పేరుతో రూ.30వేలు అందించనుంది. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఈ కీలక నిర్ణయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. 2018 జనవరి 1 నుంచి అమల్లోకి తేవాలని యోచిస్తున్నట్లు సమాచారం.

మరోవైపు రాష్ట్రంలో నెలకొన్న వివిధ అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ కొనసాగుతోంది. మూడో విడత రైతు రుణమాఫీ, ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు అంశాలపై మంత్రివర్గంలో చర్చ జరుగుతోంది.

## శ్రీశైలం జలాశయానికి పోటెత్తిన వరద



శ్రీశైలం ఆలయం: శ్రీశైలం జలాశయానికి వరదనీటి ప్రవాహం పోటెత్తింది. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల ప్రాజెక్టు నుంచి 71,335 క్యూసెక్కులు, రోజా గేజింగ్ కేంద్రం నుంచి 44,790 క్యూసెక్కులు, తరువాయి 2లో






### టేకిట్ ఈజీ



ఇక్కడుంటేనే నీకు కష్టమేంటో తెలీదు...భారీ వర్షాలు... జిఎస్టీ బాదుడు.. బయట తట్టుకోలేవు !!

## తెలుగుదేశం పాలనలో ఏ ఒక్కరూ నష్ట పోకూడదు

**ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అందరికీ రుణమాఫీ చేశాం**

**మంత్రి దేవినేని ఉమా**

విజయవాడ : గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రైతులు పంటల విరామం ప్రకటించాలని, వారికి విత్తనాలు, ఎరువులు నాణ్యమైన విద్యుత్తు అందించడంలో నాటి పాలకుల విఫలమయ్యారని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉదయం ఇబ్రహీంపట్నం మండలంలోని కిలేసపురం, జూపూడి గ్రామాల్లో మంత్రి దేవినేని ఉమ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఉమా మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గారు ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగనివ్వరని రైతు కుటుంబం నుంచి వచ్చిన ముఖ్యమంత్రి కి అన్నదాతల కష్టాలు తెలుసని, తెదేపా పాలనలో ఏ ఒక్కరూ నష్టపోకూడదని అన్నారు. రుణ విముక్తికి రైతులకు ఆత్మస్థైర్యం పెరుగుతుందని, మరొక విచిత్ర అదే ప్రదేశంలో ప్రభుత్వం చేయని విధంగా రైతులకు 24 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. 10 శాతం వడ్డీ రాయితీ తో రుణమాఫీ నిధులు సీఎం చంద్రబాబు విడుదల చేశారని ఒకేసారి రూ.50000 తరువాయి 2లో

# సత్ప్రవర్తనతో ముందడుగు

## అదనపు ఎస్పీ ఏబీటీఎస్ ఉదయరాణి




ఒంగోలు : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకని సత్ప్రవర్తనతో విద్యాభ్యాసం సాగించాలని అదనపు ఎస్పీ ఏబీటీఎస్ ఉదయరాణి ఉద్బోధించారు. ర్యాగింగ్ నేరం అన్న అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ కేంద్రంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్రం ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఎన్.నిర్మలాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంగ్లాండ్, అమెరికా తదితర దేశాల్లో ఉండే ర్యాగింగ్ క్రమంగా భారతదేశంలోని విశ్వవిద్యాలయాలకు వ్యాపించి మన సంస్కృతీ సంప్రదాయాలను కాలరాస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా 1998 చట్టం ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. మంచి విద్యార్థులుగా మెలుగుతూ విద్యాలయాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని సూచించారు. అదనపు వైద్యాధికారిణి శకుంతల మాట్లాడుతూ ర్యాగింగ్ తదితర వికృత పద్ధతులను సభ్య సమాజం హర్షించదని అన్నారు. కొత్త, పాత విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భారతీదేవి, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### ఐటిలో ఉద్యోగాల కల్పనే లక్ష్యం

రావడానికి అవకాశం ఉందని మంత్రి లోకేష్ తెలిపారు.

దమ్ము ఉంటే ఆధారాలతో నిరూపించాలి

ప్రతిపక్షం ప్రతిసారీ ఆరోపణలు చేయడం సరికాదని, దమ్ము ఉంటే ఆధారాలతో నిరూపించాలని మంత్రి లోకేష్ ప్రతిపక్షానికి సవాల్ విసిరారు. మంగళవారం విశాఖలో పర్యటిస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ భూ కుంభకోణాల్లో తనపై ఆరోపణలు చేశారని, సిట్‌కు ఆధారాలు ఎందుకు సమర్పించలేదని ప్రశ్నించారు. నరేగా నిధులు దుర్వినియోగం అవుతున్నాయంటూ వైసీపీ ఎంపీలు ప్రధాని మోదీకి లేఖలు ఇచ్చి నిధులు రాకుండా అడ్డుకుంటున్నారని మంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

### 300 మంది చిన్నారులకు అస్వస్థత

కళ్ల నుంచి మంటలు రావడంతో వారిని చికిత్సనిమిత్తం హుటాహుటిన మీరట్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. దాదాపు 300 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని.. వీరిలో 30 నుంచి 35 మంది పిల్లల పరిస్థితి విషమంగా ఉందని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. వీరిలో 15 మంది చిన్నారులను మెరుగైన వె%ద్యం నిమిత్తం మీరట్ ఆసుపత్రికి తరలించాలని సూచించినట్లు చెప్పారు. ఈ ఘటనతో చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. తమ పిల్లల జీవితాలకు ఈ చక్కెర కర్మాగారం ముప్పుగా మారిందని ఆందోళనకు దిగారు.

విచారణకు సీఎం ఆదేశం

ఈ ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరా తీశారు. సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి కారణమైన చక్కెర కర్మాగారాన్ని అధికారులు సీజ్ చేశారు.

### నవంబర్ 2 నుంచి పాదయాత్ర ప్రారంభిస్తా

జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురంలో జరిగిన యువభేరి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడాల్సిన వారే బెదిరిస్తున్నారని, ప్రత్యేక హోదా కోసం గుంటూరులో దీక్ష చేస్తే భగ్నం చేశారన్నారు. అలాగే అనంతపురంలో జరిగే యువభేరికి వచ్చే విద్యార్థులపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారని జగన్ పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్నామని, ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్‌లో పోరాడుతూనే ఉన్నామన్నారు. హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు కావాలన్నవారు మౌనంగా ఉన్నారని, ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే లక్షల ఉద్యోగాలు వచ్చేవని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతపురంలో స్మార్ట్ సిటీ, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారని, వాటిని మరిచిపోయారని, అనంతపురానికి చంద్రబాబు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని జగన్ అన్నారు.

### శ్రీశైలం జలాశయానికి పోటెత్తిన వరద

హంద్రీ నుంచి 37,313 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో శ్రీశైలం జల విద్యుత్తు కేంద్రంలో విద్యుదుత్పత్తి ముమ్మరంగా జరుగుతోంది. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో 106 మెగావాట్ల సామర్థ్యంతో 7 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో 150 మెగా వాట్ల సామర్థ్యంతో ఆరు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 6వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# భూ సమస్యలపై అర్జీల వెల్లువ

ఒంగోలు : భూమి సంబంధ సమస్యలపై మీకోసం కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయి. స్థానిక సీపీవో సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి జేసీ నాగలక్ష్మి అర్జీలు స్వీకరించారు. వలేటివారిపాలెం మండలం చుండి అయ్యవారిపాలెం గ్రామానికి చెందిన డేగా రోశయ్య తనకు పింఛను మంజూరు చేయాలని కోరారు. మార్కాపురం మండలం చింతగుంట్లకు చెందిన డి.చిన్న వెంకటయ్య తనకు భూమిని కొందరు ఆక్రమించారని, న్యాయం చేయాలని కోరారు. చినగంజాం మండలం పెదగంజాం పంచాయతీకి చెందిన ఏకుల చెంచురామయ్య, కొమరగిరి పోలిబాబు తన పొలానికి వచ్చే నీటిని రాకుండా చేశారని, పంట కాలువను పునరుద్ధరించాలని కోరారు. ఒంగోలు పులివెంకటరెడ్డి కాలనీకి చెందిన కటారి డేవిడ్ తనకు గృహం మంజూరు చేయాలని కోరారు. సంతనూతలపాడు మండలం మద్దులూరుకు చెందిన భూమా వెంకట సుబ్బయ్య తనకు పూర్వికుల ద్వారా వచ్చిన భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని, పుల్లల చెరువు మండలం ఆంజనేయస్వామి కాలనీకి చెందిన నాగమణి తనకు వితంతు పింఛను ఇప్పించాలని, వెలిగండ్ల మండలం జంగం నర్సాయపాలేనికి చెందిన వడ్డె చిన్న వెంకటయ్య, కె.ఖాజామీరా, నాగూర్‌తోపాటు మరికొందరు తమ పొలానికి నీరువచ్చేలా చేయాలని అర్జీలు సమర్పించారు. తాళ్లూరు మండలం బెల్లంకొండవారిపాలేనికి చెందిన మధుసూదన్‌రెడ్డి తన తాత ద్వారా వచ్చిన ఆస్తిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించారని, తనకు వారసత్వ హక్కు కల్పించి.. దానికి పొజెషన్ చూపించాలని కోరారు.

దర్శి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పిచ్చమ్మ తన పెద్దనాన్న భూమిని ఆక్రమించారని, న్యాయం చేయాలని కోరారు. మీ కోసంలో డీఆర్వో ప్రభాకరరెడ్డితో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 20 శాతం నాణ్యమైన విత్తనాలు

# జిల్లా నుంచే సరఫరా

జూపాడుబంగ్లా : రాష్ట్ర విత్తన అవసరాల్లో కర్నూలు జిల్లా 20 శాతం తీరుస్తోందని కలెక్టరు సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల రైతులకు నాణ్యమైన విత్తనాలు జిల్లా నుంచి సరఫరా చేస్తున్నామని తెలిపారు. తంగడంచలో ముఖ్యమంత్రి సీడ్‌హబ్ శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటయిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో నల్లరేగడి భూములు 16 లక్షల ఎకరాలు ఉన్నాయని అందులో 1.75 లక్షల ఎకరాల్లో విత్తన ఉత్పతి జరుగుతోందన్నారు.

ఈ ఉత్పత్తితో దాదాపు వివిధ రకాల విత్తనాలు 2.75 లక్షల క్వింటాళ్లు దిగుబడి సాధించి నాణ్యమైన విత్తనాలు రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు.

ఇకపై తంగడంచ సీడ్ హబ్ నుంచి రాష్ట్రానికి 100 శాతం విత్తనాలు సరఫరా చేస్తామని మొదటి విడతగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు సమకూరుస్తామన్నారు. ఐయోవా విశ్వవిద్యాలయం సహకారంతో ప్రపంచంలోనే రాష్ట్రం సీడ్‌హబ్‌గా తంగడంచ మారుతుందన్నారు.

# వంట ఇంధన భాగ్యం!

బెంగళూరు : పేద కుటుంబాలకు గ్యాస్ సిలిండర్, స్టౌ అందజేసే 'గ్యాస్ భాగ్య' పథకం డిసెంబరు ఒకటి నుంచి అమలు లోకి రానుంది. విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన ఆహార పౌర సరఫరాల శాఖ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత మంత్రి యు.టి.ఖాదర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉజ్వల పథకం కింద గ్యాస్ లభిస్తుందని- ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభించే గ్యాస్ భాగ్య పథకం కింద పేదలకు సిలిండర్, స్టౌ, రెగ్యులేటర్ తదితర వాటిని అందిస్తామన్నారు. ఈ పథకానికి రూ.1200కోట్లు వ్యయం చేస్తామన్నారు. ప్రతి లబ్ధిదారుడికి రూ.4400 వ్యయం చేస్తామని వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పన్నుల వసూలు ఆశాజనకం

గోపాలపూర్ : రాష్ట్రంలో ఈ ఏడాది పన్నుల వసూలు ఆశాజనకంగా ఉంది. 34 శాతం వృద్ధి రేటు నమోదైంది. 2016-17 ఆర్థిక సంవత్సరం తొలి ఆరునెలల్లో పన్నుల రూపంలో రూ.12,903 కోట్లు ఆదాయం సమకూరింది. 2017-18లో ఈ మొత్తం రూ.17,350 కోట్లు సమకూరింది. ఆర్థిక మాంధ్యం ఉన్నా, ఖనిజ సంపదల ద్వారా గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం తొలి ఆరునెలల్లో 42 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఆర్థికమంత్రి శశిభూషణ బెహర విలేకర్లతో మాట్లా డుతూ ప్రణాళిక వ్యయం వినియోగం లోనూ ప్రభుత్వ శాఖలు ప్రతిభ కనబరిచామని చెప్పారు. సెప్టెంబరు చివరినాటికి ఆయా శాఖలు రూ.40,169 కోట్లు ఖర్చు చేశాయన్నారు. గతేడాదితో పోలిస్తే ఇది 13 శాతం ఎక్కువన్నారు. రూ.6419 కోట్లు ఖర్చుచేసి వ్యవసాయశాఖ ముందంజలో ఉందని, సామాజిక అభివృద్ధికి 17,850 కోట్లు, సాధనా సంపత్తి కింద రూ.7,303 కోట్లు వినియోగమయ్యాయన్నారు. మొత్తమ్మీద తొలి ఆరు నెలల ఆదాయం, వ్యయం భేష్షుగా ఉందన్న మంత్రి ఆయాశాఖల అధికారులు నిష్టగా విధులు నిర్వహించాలని, బడ్జెట్ పద్దులు సద్వినియోగమయ్యేలా దృష్టి సారించాలని ఆదేశించినట్లు తెలిపారు.

## హంపీ ఉత్సవ వేదికకు బళ్లారి రాఘవ పేరు పెట్టాలి

బళ్లారి : నవంబరు 3 నుంచి జరిగే హంపీ ఉత్సవంలో ఓ వేదికకు బళ్లారి రాఘవ పేరు పెట్టాలని రాఘవ స్మారక సంఘం సభ్యులు జిల్లా అధికారి డా.వి.రామప్రశాత్ మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గౌరవ అధ్యక్షుడు కె.చెన్నప్ప, అధ్యక్షుడు కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బసవరాజు, కోశాధికారి ధనంజయ, పథాధికారి ప్రభాకర్ తదితరులు జిల్లా అధికారిని కలిశారు. దీనిపై జిల్లా అధికారి సానుకూలంగా స్పందించారు.

# ‘స్వచ్ఛతతోనే దైవత్వం’



బ్రహ్మపుర : స్వచ్ఛతతోనే దైవత్వం' నినాదంతో స్థానిక సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు సేవా కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నారు. గత 2వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాలు వచ్చే 20వ తేదీ వరకూ పరిసరాల పరిశుభ్రత, ఇతర సేవా ముమ్మరంగా నిర్వహిస్తామని సేవాసమితి ప్రతినిధులు తెలిపారు. పలువురు ప్రతినిధులు స్థానిక పాతబస్టాండులో పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. బస్టాండు ఆవరణలోని ఆహార్ కేంద్రం బయట ప్రాంతాలను శుభ్రం చేసి నీటితో కడిగారు. పాత బస్టాండులో వర్షం నీటితో నిండిఉన్న గతుకుల్లో మట్టి పోసి పూడ్చారు. అంతకుముందు బ్రహ్మపుర రైల్వే స్టేషన్, కొత్తబస్టాండు తదితర చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టామని సేవాసమితి రాష్ట్ర సమన్వయకర్త ఎస్.భాస్కరరావు చెప్పారు. వచ్చే 20వ తేదీ వరకూ ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, మందిరాల్లో సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సమితి కన్వీనరు పి.అప్పారావు పాల్గొన్నారు.

## గొలుసు దొంగకు దేహశుద్ధి

మాన్వి : దిన్ని గ్రామంలో కొన్ని నెలలుగా గొలుసులను దొంగిలిస్తున్న నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు.కూలి పనికి వెళ్లే మహిళలనే లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని గొలుసులు, చెవిదుద్దులను కాజేస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు.

# చైతన్య రథం ప్రారంభం



బ్రహ్మపుర : నగరవాసులకు వివిధ వ్యాధులపై చైతన్యం కల్పించడంతోపాటు పరిసరాల పరిశుభ్రత తదితరాలపై ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన చైతన్య రథాన్ని ప్రారంభించారు. స్థానిక బీఎమ్సీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మేయరు కె.మాధవి రథానికి జెండా వూపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఎమ్సీ కమిషనర్ నిఖిల్ పవన్ కల్యాణ్, జిల్లా ముఖ్య వైద్యాధికారి (సీడీఎంఓ) సరోజ్‌కుమార్ మిశ్ర, జిల్లా అదనపు వైద్యాధికారి, ఏడీఎంఓ (ప్రజారోగ్యం) ఆర్.జగదీష్ పట్నాయక్, జిల్లా మలేరియా అధికారి ఉమాశంకర మిశ్ర తదితరులు పాల్గొన్నారు. ఏడీఎంఓ (ప్రజా రోగ్యం) పట్నాయక్ మాట్లా డుతూ ఈ చైతన్య రథం నగరంలో నవంబరు 7వ తేదీ వరకూ తిరుగుతుందని చెప్పారు. మలేరియా, డెంగీ, అతిసారం, పచ్చ కామెర్లు, స్వైన్‌ఫ్లూ తదితర వ్యాధులతోపాటు మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం, పరిసరాల పరిశుభ్రత తదితరాలపై రథం ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పిస్తామని పట్నాయక్ పేర్కొన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో ఈ రథం తిరుగుతుందని తెలిపారు.

# గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి

తిరువణ్ణామలై : తిరువణ్ణామలైలోని గిరి ప్రదక్షిణ మార్గంలో రూ.63 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్తీక దీపోత్సవానికి ముందే పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కె.ఎస్.కందస్వామి పేర్కొన్నారు. ఈ మార్గంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి యమలింగం వరకు 4 కిలోమీటర్ల దూరం ఆయన నడుచుకొంటూ వెళ్లి తనిఖీలు చేశారు. అక్కడ జరుగుతున్న పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ మార్గంలో ఇరువైపులా మొక్కలు నాటాలని, ప్రస్తుతం 11 మీటర్లుగా ఉన్న గిరి ప్రదక్షిణ మార్గాన్ని 16 మీటర్లకు పెంచాలన్నారు.

డిసెంబర్‌లో అరుణా చలేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మహా దీపోత్సవం జరుగుతుందని, ఆలోపు ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కలెక్టరు వెంట జిల్లా రెవెన్యూ అధికారి రత్తినస్వామి, సబ్ కలెక్టర్ ఉమామహేశ్వరి, పురపాలక కమిషనర్ పారి జాతం తదితరులు ఉన్నారు.

# బెంగళూరుకు విద్యార్థుల పాదయాత్ర



బెంగళూరు: కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని (కేఎస్ఓయూ) పరిరక్షించాలంటూ అఖిల భారత విద్యార్థి పరిషత్తు (ఏబీవీపీ) పాదయాత్రను చేపట్టింది. మైసూరులోని రామస్వామి సర్కిల్ నుంచి బెంగళూరుకు ప్రారంభమైన ఈ పాదయాత్రలో వేలాది విద్యార్థులు పాల్గొన్నారు. 1996లో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం లక్షలాది పేద విద్యా ర్థులకు, నిరుద్యోగులకు ఉపాధి దుర్గంగా ఉంటోంది. యాజమాన్యం చేసిన తప్పిదాలకు విద్యార్థి భవిష్యత్తు అంధకారంగా మారిందని ఏబీవీపీ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి స్వామి మరళాపుర ఆరోపించారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ రాయరెడ్డిని గెలిపించింది విశ్వవిద్యాలయాలను మూసి వేసేందుకు కాదని, యూజీసీతో చర్చించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండు చేశారు. ఈ విశ్వ విద్యాలయంలో నియామకాలు ఒకే వర్గానికి అనుకూలంగా మారుతూ, అక్రమా లకు అడ్డాగా మారిందన్నారు. రాష్ట్రంలో 54కు పైగా విశ్వవిద్యాలయాలుండగా వీటిల్లో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఇతర పథాధికారుల నియామకాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆయన ఆరోపిం చారు. ఈ పాదయాత్ర సందర్భంగా వీరంతా కేఎస్ఓయూ కులపతి ఆచార్య రామేగౌడకు వనతి పత్రాన్ని సమర్పించారు. సమస్య పరిష్కా రానికి విన్నవించారు.

# ఆధార్‌పై ఆకాశయానం!

బెంగళూరు: కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే ఏడాది డిసెంబరులోపు ఆధార్ ఆధారిత విమానాశ్రయంగా రూపుదిద్దుకోనుంది. దేశంలోనే ఈ వ్యవస్థను అమలు చేసుకునే తొలి విమానాశ్రయంగా కేఐఏ అవతరించనుందని విమానాశ్రయం సీఎండీ హరి మురార్ ప్రకటించారు.

ఆధార్ ఆధారంగానే ప్రవేశాలు, బయోమెట్రిక్ బోర్డింగ్ వ్యవస్థతో మరింత భద్రతతో పాటు ప్రయాణికుల సమయం ఆదా అయ్యే అవకాశం ఉంది. ఒక్కో ప్రయాణికుడి తనిఖీ కోసం ప్రస్తుతం 25 నుంచి 30 నిముషాల సమయం అవసరం. ఆధార్ ద్వారా కేవలం 10 నిముషాల్లో వివిధ క్రతువులు ముగించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కొత్త వ్యవస్థ ఏర్పాట్లు ప్రారంభం కాగా.. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ-బోర్డింగ్ సదుపాయాలను జనం వినియోగించుకోనున్నారు. ఒక్కసారి ఆధార్ ఆధారంగా ప్రవేశించిన వ్యక్తి.. ఆపై గుర్తింపు కార్డు చూపించే అవసరం లేదు. ప్రవేశ ద్వారం వద్ద వేలిముద్రలతో అతని వివరాలు సేకరిస్తారు. ఇది ప్రయాణికుడి భద్రతే కాకుండా విమానాశ్రయానికి తగిన రక్షణ కల్పించేందుకు ఉపయోగపడుతుందని మురార్ పేర్కొన్నారు.

# భార్యను కడతేర్చిన భర్తకు కటకటాలు

బెంగళూరు : భార్యను హత్య చేసి పరారైన దుండగుడ్ని అన్నపూరే?శ్వరి నగర పోలీసులు అరెస్టు చేశారు. మండ్య జిల్లా నాగమంగళలోని ఓ ఇంట్లో దాగున్న నిందితుడు కుమార్ (32)ను అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చారు.

మాకళిలో కుమార్ తన భార్య పార్వతి, ఆరునెలల బిడ్డతో కలిసి నివసించేవాడు. ఇద్దరూ ప్రైవేట్ సంస్థల్లో పని చేసేవారు. తాగుడికి బానిసైన ఆయన భార్యపై అనుమానంతో ఆగస్టు 7న రాత్రి హత్య చేసి పరారయ్యాడు. ఆమెపై గుర్తు తెలియని దుండగులు అత్యాచారానికి పాల్పడి, హత్య చేసి నట్లు చిత్రీకరించాడు. హత్య కేసులో దుండ గులు ఎంతకూ దొరక్క పోవడంతో పోలీసులు అ ప్రదేశంలో ఉన్న నిఘా కెమేరాల్ని పరిశీలించారు. కుమార్ కదలికలు అనుమానాస్పదంగా కనిపిం చాయి. దుండగుడి కోసం కాపు కాసి అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

# లక్ష్య సాధనతోనే ఉత్తమ ఫలితాలు



బ్రహ్మపుర : విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోగలరని బీఎమ్సీ కమి షనర్ నిఖిల్ పవన్ కల్యాణ్ చెప్పారు. గంజాం జిల్లా పాఠశాలల స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బ్రహ్మపుర క్రీడామైదానంలో గంజాం జిల్లా పాఠశాలల 63వ ఛాంపియన్‌షిప్-2017 ప్రారంభమైంది. పోటీలను ముఖ్యఅతిథిగా ప్రారంభించిన కమిషనర్ పవన్ కల్యాణ్ మాట్లాడుతూ క్రీడల్లో గుర్తింపుపొంది, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు పొందితే ఉద్యోగావకాశాలు వరిస్తాయని చెప్పారు.

లక్ష్యసాధనతో విద్యార్థిని, విద్యార్థులు ముందుకుసాగితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని కమిషనర్ పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మరో అతిథిగా పాల్గొన్న అంతర్జాతీయ లిఫ్టరు కె.రవికుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో బాలబాలికలు మెలగాలని, క్రీడాసూర్తితో క్రీడాంశాల్లో పోటీపడాలన్నారు. జిల్లా విద్యాధికారి, జిల్లా పాఠశాలల స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్య క్షుడు సనాతన పండా అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో జిల్లా క్రీడాధి ,కారి ప్రశాంతకుమార్ సాహు, రొంగయిలుండా సమితి విద్యాధికారి ప్రభాతికుమారి మహాపాత్ర్, జిల్లా వ్యాయామ విద్యాధికారి దీనబంధుపాత్రో తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు, క్రీడాకారిణులు కవాతు నిర్వహించారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ పోటీల్లో అండర్-14 బాలబాలికల అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో ఆటలు ఆడిస్తారు. ఇందులో బ్రహ్మపుర, అస్కా, భంజనగర్, ఛత్రపురం, దిగపొహండి, కవిసూర్యనగర్ జోన్ల పాఠశాలల నుంచి 432 బాలబాలికలు పాల్గొంటున్నారు.

# డెంగీని ఆరోగ్యశ్రీలో చేర్చాలి

## ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ధర్నా, ప్రదర్శన




నెల్లూరు : జిల్లాను వణికిస్తున్న విష జ్వరాల వల్ల ఎంతోమంది చనిపోతున్నా.. వైద్య,ఆరోగ్యశాఖ సరైన చర్యలు చేపట్టడం లేదంటూ ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు రోడ్డెక్కారు. ఈ మేరకు కనక మహల్ కూడలిలో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఏవో సాయిరాంకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మహిళా నాయకురాలు మస్తాన్‌బీ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కాలంలో విష జ్వరాలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. మరోవైపు జ్వరాలతో మరణాలు సైతం ఎక్కువవుతున్నా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. త్వరితగతిన వైద్య సదుపాయాలను విస్తృతం చేయాలన్నారు. డెంగీ జ్వరం వస్తే రూ.60 నుంచి రూ.70 వేలు వరకూ ఖర్చు చేయాల్సి వస్తుం దన్నారు. ఈ క్రమంలో డెంగీని ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం చేర్చాలని డిమాండ్ చేశారు. నగరంలో పారిశుద్ధ్యం దారుణంగా ఉందని ఆరోపించారు. దోమల నిర్మూలన చర్యలు చేపట్టడం లేదన్నారు. బేటెక్స్ ద్రావణం, ఆయిల్ బాల్స్ వంటి దోమల నియం త్రణ చర్యలను చేపట్టకుండా నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పలుచోట్ల తాగునీరు కలుషితమవు తున్నా.. పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి నంద కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

## 13న అధికార భాషా సంఘం సమావేశం

ఒంగోలు : ఈ నెల 13వ తేదీ అధికార భాషా సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు డీఆర్వో డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. స్థానిక సీపీవో సమావేశం మందిరంలో జరిగే ఈ సమావేశానికి కలెక్టర్ వినయ్‌చంద్ హాజరవుతారన్నారు. తెలుగు అమలుపై సమీక్షిస్తారన్నారు. జిల్లా అధికారులు తగిన నివేదికలతో హాజరుకావాలని కోరారు.

## ఉద్యోగ మేళాకు విశేష స్పందన

### 45 మందికి ఉద్యోగ అవకాశాలు

ఒంగోలు : రాష్ట్ర నైపుణ్యాభివ ృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. ఒంగోలు లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు, శంషాబాద్‌కు చెందిన క్రిష్టల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, తడ శ్రీసిటీకి చెందిన వీర్ మొబైల్ సంస్థలు పాల్గొ న్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 102 మంది నిరుద్యోగ యువతీ యువకులు ముఖాముఖీకి హాజరయ్యారు. 45 మందికి ఉద్యోగాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజరు షేక్ మీరావళి తెలిపారు. కృష్ణపట్నం పోర్టుకు 27 మంది, క్రిష్టల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు 16 మంది, వీర్ మొబైల్ సంస్థకు ఇద్దరు ఎంపికైనట్లు వెల్లడించారు. స్కిల్ కనెక్ట్ పోగ్రాం కార్యక్రమంలో భాగంగా ప్రతి రెండు వారాలకు ఒక సారి నిరుద్యోగ యువకులకు ఉద్యోగ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేటు పరిశ్రమల్లో నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించడమే దీని ముఖ్య ఉద్ధేశమన్నారు.


### నాణ్యమైన విత్తనంతో పాటు

## ఆరోగ్యం బాగుండాలన్నదే సీఎం లక్ష్యం

నందికొట్కూరు : రైతుకు నాణ్యమైన విత్తనం అందించడమే కాకుండా ఆ విత్తనం ద్వారా తయారైయ్యే ఆహారం కూడా ఆరోగ్యకరంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ధ్యేయమని వ్యవసాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ అన్నారు. తంగడంచలో సీఎం సీడ్‌హబ్ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఏ ప్రాజెక్టు ప్రారంభించినా ఏడు తరాల ప్రజలు గుర్తుండిపోయేలా చేస్తారన్నారు. జూన్ 2న జరిగిన నవనిర్మాణదీక్షల్లో హ ృదయంపై చేతులు పెట్టి ప్రమాణం చేయించి కరవు నివారణ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారని ప్రస్తుతం అది నిజమయ్యిందన్నారు. రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుతుండడం చాలా గర్వంగా ఉందన్నారు. కలసి కష్టపడదాం, మంచివ్కెపు సాగుదాం, ఆంధ్రరాష్ట్రాన్ని వ్యవసాయం వైపు తీసుకెళ్దామని చెప్పారు.

### రామలింగేశ్వరుని తాకిన

## భానుని కిరణాలు



జరుగుమల్లి : మండలంలోని నర్సింగోలులో ప్రసిద్ధి గాంచిన గంగా పార్వతీ సమేత రామ లింగేశ్వరస్వామి దేవ స్థానంలో స్వామి వారిని సూర్యకిరణాలు తాకాయి. పది నిముషాల పాటు సూర్య కిరణాలు తాకడంతో గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో దేవ స్థానానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రధాన అర్చకుడు జంధ్యాల చంద్ర భాస్కరశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృత, ఫలామృత అభిషేకాలు నిర్వహించారు. పార్వతీదేవికి కుంకుమార్చన చేశారు.

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

### డీఈవో బి.విజయభాస్కర్

ఒంగోలు : విద్యార్థుల్లో చిన్నతనం నుంచే ఆత్మవిశ్వాసం పెంపొందేలా పాఠ్యాంశాల బోధన సాగాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి బి.విజయభాస్కర్ అన్నారు. ఆనంద లహరి అభ్యసన కార్యక్రమంపై ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అయిదు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరం ఒంగోలు సర్వశిక్ష అభియాన్ సమావేశ మందిరంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రిషి వ్యాలీలో విద్యా బోధనకు అవలంబిస్తున్న పద్ధతు లను ప్రతి ఉపాధ్యాయుడు ఆచరించాలన్నారు. విద్యార్థులకు బోధించేది ఏదైనా దృశ్య రూపకంలో ఉంటే త్వరగా అర్థం చేసుకుంటారన్నారు. భవిష్యత్తులో అన్ని పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేస్తామన్నారు. సహనాన్ని కోల్పోయి చిన్నారులను కొట్టి భయ పెట్టవద్దని, పిల్లలతో కలిసి అన్ని విషయాలు ముచ్చటించాలన్నారు. వారిలోని ఆసక్తిని గమనించి.. వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. శిక్షణ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థి

చిల్లకూరు : చిల్లకూరు గురుకుల పాఠశాల చెందిన ఎం.వంశీకృష్ణ అనే విద్యార్థి జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు అండర్-19 విభాగంలో ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రకళాదేవి తెలిపారు.

# ఆక్వారంగం అభివృద్ధికి చతుర్ముఖ వ్యూహం

నెల్లూరు : రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరు ఆక్వారంగం సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్ పేర్కొన్నారు. నెల్లూరు నగరం కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీహాల్లో నిర్వహించిన టాస్క్ ఫోర్సు కమిటీ సమావేశంలో ఆయన ఆక్వా సీడ్, ఫీడ్, టెక్నిషియన్స్, ల్యాబ్, యాంటి బయోటిక్స్ షాపుల నిర్వాహకులు, రైతులతో సమీక్షించారు. చతుర్ముఖ వ్యూహంతో ఆక్వారంగాన్ని కాపాడుకుంటామని నిషేధిత యాంటి బయోటిక్స్ అమ్మకాల ఆట కట్టిస్తామన్నారు. రాష్ట్రం విడిపోయాక ఆదాయ వనరులు తగ్గాయన్నారు. ఈ తరుణంలో రాష్ట్రానికి అధిక శాతం ఆదాయం తెచ్చిపెడుతున్నది ఈ రంగమేనన్నారు. యాంటి బయోటిక్స్ వాడటం వల్ల విదేశాలకు ఎగుమతి చేసిన 20 రొయ్యల కంటైనర్లు వెనక్కు పంపేశారని చెప్పారు. ఇలా మళ్లీ జరిగితే మన రొయ్యలపై విదేశీయులకు ఉన్న నమ్మకాన్ని పూర్తిగా కోల్పోతామన్నారు. దేశంలో రొయ్యలు తినేది కేవలం 5 శాతమేనని, మిగిలిన 95 శాతం విదేశాలకు ఎగుమతి చేయడం వల్ల ఆదాయం వస్తోందన్నారు. ఈ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకుని యాంటి బయోటిక్స్‌ను వాడటం మానుకోవాలన్నారు. రొయ్య రైతులను మోసం చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యాంటి బయోటిక్స్‌ను ప్రోత్సహిస్తున్న టెక్నిషియన్లపై చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని రొయ్యరైతులంతా తమ సాగు చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నెల్లూరు జిల్లా తూపిలి పాళెంలో 30 ఎకరాల్లో రొయ్య రైతుల కోసం పాలికిట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఆప్‌కాప్ ఛైర్మన్ కె.పాలిశెట్టి మాట్లాడుతూ ప్రాసెసింగ్, ఫీడ్, సీడ్, హేచరీల నిర్వాహకులు ఈ యాంటి బయోటిక్స్ వాడకంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మత్స్యకళాశాల ప్రిన్సిపల్ హరిబాబు, ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మేనేజర్ రంజిత్, జిల్లా రొయ్య రైతుల సంఘం అధ్యక్షులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు సాల్మాన్‌రాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన రొయ్య రైతులు, టెక్నిషియన్లు, హేచరీలు, ల్యాబ్ నిర్వాహకులు, ఫీడ్ ఉత్పత్తిదారులు వారి సమస్యలను వివరించారు.

# పరిశోధనలతోనే సత్వర అభివృద్ధి




ఒంగోలు : దేశం భావి శాస్త్రవేత్తల వైపు చూస్తోందని, విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సృజనాత్మకతతో పరిశోధనల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సతీష్ ధవన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం(షార్) డిప్యూటీ డైరెక్టర్ కె.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పేస్ వీక్-17 ప్రదర్శన ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ఇస్రో ఉద్యోగుల్లో చాలా మంది ఒంగోలు పరిసర ప్రాంతాలకు చెందినవారే ఉన్నారని, వారందరినీ స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పరిశోధనల వైపు మళ్లాలన్నారు. ఐఐటీ విద్యా సంస్థల్లో చదువుకున్న వారికి మాత్రమే ఇస్రోలో ఉద్యోగాలు వస్తాయన్న అపోహను మనస్సుల్లో నుంచి తొలగించాలన్నారు. క్విస్ విద్యా సంస్థల అధ్యక్షుడు ఎన్.నాగేశ్వర రావు మాట్లాడుతూ సోమవారం సుమారు పది వేల మంది విద్యార్థులు ప్రదర్శనలోని నమూ నాలను సందర్శించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నా రన్నారు. అనంతరం కళాశాలలో తుది సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రూపొందించిన పలు కొత్త తరహా పరిశోధనలను పరిశీలించిన ఇస్రో బృందం, ఆరుగురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన అంతరిక్ష లఘు చిత్రాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సమావేశంలో షార్ ప్రతినిధి జి.రమేష్‌బాబు, కళాశాలల కార్యదర్శి కల్యాణ చక్రవర్తి, కళాశాల ప్రధానాచార్యులు వీరాస్వామి, సుబ్బారావు, ఆర్అండ్‌డి డైరెక్టర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ టీచర్ల నియామకానికి విద్యాశాఖ కసరత్తు



డోన్ : రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ సిబ్బంది లేకపోవడంతో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నట్లు పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 4,500 ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ టీచర్ల నియామకానికి విద్యాశాఖ కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన డోన్ పట్టణంలోని ఐటీఐతో పాటు ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో పాతకాలం నాటి రోనియో మిషన్ ఆపరేటర్లు తదితర 21 పోస్టుల స్థానంలో కంప్యూటర్, ల్యాబ్, గ్రంథాలయం వంటి పోస్టులను నియమించాలని విద్యాశాఖ మంత్రికి చేసిన ప్రాతినిధ్యం మేరకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 163 ఆదర్శ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేసి వేతనాలను చెల్లించడానికి సీఎం ఆమోదం కోసం విద్యాశాఖ ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సాంఘిక, సంక్షేమ గురుకులాల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానాచార్యులు, పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్జీటీలకు, యూపీ పాఠశాలల్లో పనిచేసే ఎస్ఏలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని ఎన్నికల కమిషన్‌కు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించినట్లు చెప్పారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టును మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఇ.షణ్ముర్తి మాట్లాడుతూ పదో పీఆర్సీ వేతన కమిషన్‌ను వెంటనే నియమించాలని, పీఆర్సీ బకాయిలను, రెండు విడతల డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుకు కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మౌలాలి, జిల్లా నాయకులు జి.వి.రమణ, నాగరాజు, ఇక్బాల్‌బాషా, జి.మద్దిలేటి పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అయోవా స్టేట్ పరిజ్ఞానం గల విశ్వవిద్యాలయం

నందికొట్కూరు : అమెరికాలో ఉన్న అయోవా స్టేట్ విశ్వ విద్యాలయం ప్రపంచంలోనే అత్యంత పరిజ్ఞానం గల విశ్వ విద్యాలయం అని ఆ సంస్థ గ్లోబల్ ప్రోగ్రామ్ లీడర్‌షిప్‌నకు నేతృత్వం వహిస్తున్న దిలీప్ అన్నారు. జూపాడుబంగ్లా తంగడంచ సీడ్‌ఫారం భూముల్లో విత్తనోత్పత్తి విశ్వవిద్యాలయం పరిశోధనా కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ ఇక్కడ వివిధ రకాల విత్తనాల తయారీతో పాటు కొత్త వంగడాలను కనుకొంటామన్నారు. అయోవాకు, ఇండియాకు సత్సంబంధం ఇప్పటిది కాదని కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నాయన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీ నిరాహార దీక్ష చేసిన సమయంలో తీసుకున్న పోషకాహారాల గురించి జార్జ్‌వాషింగ్‌టన్‌కు లేఖ రాశారని అవన్నీ భద్రపరిచారన్నారు. నార్మన్‌బోర్లాగ్, ఎంఎస్ స్వామిదాస్‌లు హరిత విప్లవానికి నాంధి పలికారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విత్తన విప్లవానికి నాంది పలకారన్నారు. యుద్ధప్రాతిపదికన విత్తనోత్పత్తి కేంద్రాన్ని పూర్తి చేసి రైతులకు మేలైన విత్తనాలు త్వరలో అందించాలని సీఎం కోరినట్లు తెలిపారు.

మూడు నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగనున్నట్లు చెప్పారు. విత్తన హబ్ నమూనాలను తెరపై ప్రదర్శించి చూపారు. ఏపీలో విత్తనోత్పత్తి క్షేత్రం ఏర్పాటు విత్తన విప్లవానికి నాంది పలుకుతుందన్నారు. అయోవా సంస్థ ప్రతినిధి మిశ్రా మాట్లాడుతూ స్థానికంగా మేలురకం విత్తనాలను తయారు చేస్తామన్నారు.

## సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

అర్ధవీడు : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయ సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ రవికుమార్ యాదవ్ అన్నారు. అర్ధవీడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివ ృద్ధి ఫలాలు అర్హులకు అందాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్ధ్య సమస్యలను మెరుగుపరచాలన్నారు.


## రుణమాఫీ....రైతు బతుకు సాఫీ


నందికొట్కూరు : చంద్రబాబునాయుడు చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం తమ బతుకులను మార్చేసిందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు. తంగడంచలో సీడ్‌హబ్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సభలో వేలాది మంది రైతులు పాల్గొన్నారు. ఈసందరరేగా ముఖ్యమంత్రి మూడో విడత రుణమాఫీ మొత్తం రూ.3000 కోట్లు, వడ్డీ కింద రూ. 600 కోట్లను చెక్కురూపంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు చంద్రబాబునాయుడుకు నాగలి బహుమానంగా ఇచ్చారు. అనంతరం ఆళ్లగడ్డకు చెందిన రైతు రమణయ్య సభావేదికపైకి వచ్చి మాట్లాడారు.

ఇప్పటికీ తాను కంది, వేరుసెనగ పంటలను సాగు చేశానని వచ్చిన దిగుబడిని కొనుగోలు చేసేందుకు ప్రైవేటు కంపెనీలు తమను ఆశ్రయిస్తున్నారని అన్నారు. తంగడంచలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విత్తనోత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయని దీనికోసం రైతులందరూ ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నామని %శ%ర్కొన్నారు. ప్రాతకోటకు చెందిన రైతు శ్రీరాములు మాట్లాడుతూ తనకు బ్యాంకులో రూ. 1.20 లక్షల అప్పు ఉండేదని పూర్తిగా మాఫీ అయ్యిందన్నారు. రెండు విడతలుగా ప్రభుత్వం అందిస్తున్న రుణం బ్యాంకులో జమ అయ్యిందన్నారు. మూడో విడత కూడా బ్యాంకుల్లో జమ అవుతుందని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# తెదేపాతోనే రైతుల అభివృద్ధి సాధ్యం : మంత్రి నారాయణ

గూడూరు : రైతుల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని, తెదేపాతోనే రైతులకు భరోసా కలుగుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా తెదేపా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, బీద రవిచంద్రయాదవ్, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, జిల్లా సంయుక్త పాలనాధికారి ఇంతియాజ్‌తో కలిసి ఆయన నియోజకవర్గంలోని రైతులకు మూడో విడత రుణమాఫీ పత్రాలను అందించారు. ముందుగా మంత్రి నారాయణ, ఎమ్మెల్సీకి ఎమ్మెల్యే, తెదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో చేయని విధంగా సీఎం రుణమాఫీ చేశారన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ ద్వారా 57.5 లక్షల మంది రైతలు లబ్ధి పొందారన్నారు. రూ.24 వేల కోట్లను రుణమాఫీ చేసిన ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ రుణమాఫీ రైతులకు చేరలేదని లేనిపోని ఆరోపణలు చేస్తూ రైతులను మోసగిస్తున్నారని, ఈ చర్యలు దారుణమన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నా వ్యవసాయాన్ని లాభసాటిగా అభివ ృద్ధి చేస్తే 64 శాతం మంది రైతులకు ప్రయోజనం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ ఆఖరుకు రూ.13 వేల కోట్లతో రాష్ట్రంలో 28 ప్రాజెక్టులు పూర్తి చేసేలా క ృషి చేస్తున్నామన్నారు. అన్నదాతల కళ్లలో సంతోషం చూడాలన్నదే సీఎం ధ్యేయమన్నారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను కలిపితే రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాల్లో వ్యవసాయం చేసే వీలుందన్నారు. ఎమ్మెల్సీ బీద రవి చంద్ర యాదవ్, ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో తెదేపా చొరవతో అన్ని రంగాల్లో ముందుకు పోతున్నట్లు తెలిపారు. గూడూరు పట్టణంలో విషజ్వరాలు, సీజలన్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసు కెళ్లారు. వైద్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తక్షణం వైద్య సేవలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తక్షణం వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త పాలనా ధికారి ఇంతియాజ్, ఛైర్‌పర్సన్ దేవసేన, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ మెట్టకూరు ధనంజయరెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రుణ మాఫీని రైతులందరూ సద్విని యోగం చేసుకుని వ్యవ సాయంలో అభివృద్ధి చెందాలని కోరారు. అనం తరం రైతు లకు రుణమాఫీ పత్రాలను మంత్రి నారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఓఎస్‌డీ పెంచలరెడ్డి, జేసీ-2 వెంకట సుబ్బారెడ్డి, ఆర్డీవో అరుణ్‌బాబు, జడ్పీటీసీ సభ్యులు పద్మ, భారతి, ఎంపీపీ రమాదేవీ, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు, కార్య దర్శులు, తెదేపా నాయకులు, వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్, రైతుశిక్షణ కేంద్రం ఉప సంచాలకులు శివనారాయణ, ఏడీఏలు అనిత, శివనాయక్, నర్సోజీరావు, ఉషారాణి, బాలాజీ నాయక్, ఏవో, అధికారులు తదితరులు ఉన్నారు.





విజయభాను

## సంపాదకీయం

### సంక్షోభంలో క్యాటలోనియా

స్పెయిన్‌లోని క్యాటలోనియా ప్రాంతం విడిపోవడానికి సిద్ధపడటంతో సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకున్నది. క్యాటలోనియా ప్రధాని కార్లోస్ పూయిగ్‌డిమాంట్ మంగళవారం రాష్ట్ర పార్లమెంటులో స్వతంత్ర ప్రకటన చేయడానికి రంగం సిద్ధమైంది. పార్లమెంటు సోమవారమే సమావేశమై ఈ మేరకు తీర్మానం చేయవలసింది. కానీ న్యాయస్థానం సోమవారం నాటి సమావేశాన్ని నిషేధించడంతో మరుసటిరోజుకు వాయిదా పడ్డది. స్పెయిన్ ప్రభుత్వం తెరవెనుక ఒత్తిడి లేదా బుజ్జగింపుల ద్వారా నిరోధిస్తే తప్ప స్వతంత్ర ప్రకటన వెలువడే అవకాశం ఉన్నది. దీంతో క్యాటలోనియా స్వతంత్రం ప్రకటించుకుంటుందా అనే ఉత్కంఠ యూరప్ అంతటా నెలకొన్నది. క్యాటలోనియాలో ఇటీవల జరిగిన రిఫరెండంలో ప్రజలు స్వతంత్రం వైపే మొగ్గు చూపారు. అయితే ఈ రిఫరెండాన్ని స్పెయిన్ ప్రభుత్వం గుర్తించకపోగా, ఓటింగ్‌కు వచ్చిన ప్రజలపై దాడులకు పాల్పడ్డది. దీంతో క్యాటలోనియా ప్రజలలో మరింత ఆగ్రహం వ్యక్తమవుతున్నది. క్యాటలోనియా విడిపోవడాన్ని స్పెయిన్ అంగీకరించడం అంత సులభం కాదు. దేశాన్ని ముక్కలు చేసుకోవాలని స్పెయిన్ ప్రభుత్వానికి ఇతర దేశాలూ సలహా ఇవ్వలేవు. కానీ క్యాటలోనియా రిఫరెండం పట్ల స్పెయిన్ అనుసరిస్తున్న విధానం ఆ దేశానికే మంచిది కాదనే ది వాస్తవం. మొరటు విధానాలవల్ల స్పెయిన్‌లో ఉండాలని కోరుకునే వారూ స్వతంత్రం వైపు మొగ్గు చూసే పరిస్థితి ఏర్పడ్డది. రిఫరెండం జరుపబోతున్నట్టు తెలిసి కూడా క్యాటలోని యా నాయకులతో చర్చలు జరుపలేదు. పార్లమెంటులో స్వతంత్ర ప్రకటన జరుగవచ్చని తెలియడంతో, సోమవారం నాటికల్లా స్పెయిన్ ప్రభుత్వం కొంత మెత్తబడినట్టు కనిపిస్తున్నది. రిఫరెండం సందర్భంగా లాఠీచార్జి జరిపినందుకు క్షమాపణ కోరింది. మంగళవారం నాటికి మరో మెట్టు దిగి వస్తే, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి మార్గం ఏర్పడుతుంది. స్పెయిన్‌లోని ఈశాన్య ప్రాంతంలో ఉండే క్యాటలోనియా జాతిపరంగా, సాంస్కృతికంగా భిన్నమైంది. ఆర్థికంగా సంపన్నమైంది. ఎంతో కాలంగా అస్తిత్వం కోసం పోరాడుతున్నది. ఎనిమిదవ శతాబ్దం నాటికే క్యాటలోనియా సొంత అస్తిత్వాన్ని కలిగి ఉన్నది. 17, 18 శతాబ్దాలలో క్యాటలన్ అస్తిత్వాన్ని నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలు నెరవేరలేదు. 1659లో స్పెయిన్, ఫ్రాన్స్ మధ్య ఒప్పందం మేరకు క్యాటలోనియా ప్రాంతాన్ని రెండు దేశాలు పంచుకున్నాయి. అటు ఫ్రాన్స్‌లో, ఇటు స్పెయిన్‌లో క్యాటలన్ భాషా సంస్కృతులను నామరూపాలు లేకుండా చేయడానికి తీవ్ర అణచివేత సాగింది. స్పెయిన్ దేశం క్యాటలన్ భాష మాట్లాడటాన్ని నేరంగా పరిగణించింది. ఈ భాషలో విద్యాబోధనను నిషేధించింది. 1931లో సెకండ్ స్పానిష్ రిపబ్లిక్ ఏర్పడినప్పుడు క్యాటలన్ జాతికి గుర్తింపు లభించినప్పటికీ, జనరల్ ఫ్రాంకో అధికారానికి రావడంతో మళ్ళా అణచివేత మొదలైంది. 1978లో స్పెయిన్‌లో ప్రజాస్వామ్యం నెలకొనడంతో క్యాటలోనియా స్వయం ప్రతిపత్తి పొందింది. కానీ ఈ మాత్రానికి ఎంతో తాత్సారం జరుగడమే కాకుండా, కీలకమైన అధికారాలు ఇవ్వలేదు. శాంతియుత ప్రయత్నాల పట్ల విసిగిపోవడం వల్లనే పరిస్థితి ప్రజాభిప్రాయ సేకరణకు దారి తీసింది. స్పెయిన్ పరిధిలోనే క్యాటలోనియా తమ స్వయంప్రతిపత్తిని పూర్తిగా అనుభవించడానికి అవకాశాలు కల్పిస్తే, విడిపోయే పరిస్థితి రాకపోయేది. స్కాట్‌లాండ్ ప్రజలు విడిపోదామని కోరుకున్నప్పుడు బ్రిటన్ స్వయంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. స్కాట్‌లాండ్ ప్రజలకు నచ్చ చెప్పి ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా దేశ ఐక్యతను కాపాడటంలో సఫలమైంది. బ్రిటన్ అనుసరించిన ప్రజాస్వామ్య విధానం ప్రశంసలను అందుకున్నది. స్పెయిన్ కూడా మంగళవారం నాటి ప్రకటన వెలువడటానికి ముందే చర్చలకు దిగి సంక్షోభాన్ని నివారించడం శ్రేయస్కరం. సాధారణంగా ఏ ప్రాంతమైనా దేశం నుంచి విడిపోయే పరిస్థితి ఏర్పడితే ఇరుపక్షాల మధ్య చర్చలు సాగుతాయి. విభజన విధానాలు చర్చించుకుంటారు. ఇందుకు అవసరమైతే మధ్యవర్తుల తోడ్పాటు తీసుకుంటారు. అంతేతప్ప ఏకపక్ష స్వతంత్ర ప్రకటన ద్వారా విడిపోయి నెగ్గు కు రావడం అంత సులభం కాదు. క్యాటలోనియాకు యూరోపియన్ యూనియన్‌లో సభ్య త్వం రావాలంటే స్పెయిన్ అడ్డుకుంటుంది. ఇతర దేశాలతో లావాదేవీలు జరుపడం కష్టం. అలాగని క్యాటలోనియాతో చర్చలు జరుపకుండా తలుపులు బిడాయించుకోవడం కూడా మంచిది కాదు. 1980 దశకంలో మొదలైన నయా ఉదారవాద, ప్రపంచీకరణ విధానాల ప్రభావం క్రమంగా ప్రపంచమంతటా కనిపిస్తున్నది. యూరప్‌లోని దేశాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

## ఇంధనంపై వ్యాట్ తగ్గించిన మరో రాష్ట్రం...




ముంబై: పెట్రో ఉత్పత్తులపై వ్యాట్ తగ్గించుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఇచ్చిన పిలుపునకు మరో రాష్ట్రం స్పందించింది. గుజరాత్ ప్రభుత్వం 4 శాతం వ్యాట్ తగ్గిస్తున్నట్టు మంగళవారం ప్రకటించగా, ఇదే బాట పట్టిన రెండో రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచింది. పెట్రో ఉత్పత్తులపై వ్యాట్ తగ్గిస్తున్నట్టు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆ రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ రూ.2, డీజిల్ రూ.1 చొప్పున తగ్గింది. మంగళవారం అర్ధరాత్రి నుంచే ఈ ధరలు అమల్లోకి వస్తాయని, దీపావళి కానుకగా ఈ నిర్ణయం తీసుకున్నామని మహారాష్ట్ర ఆర్థిక మంత్రి సుధీర్ ముంగటివార్ తెలిపారు. తాజా తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.2,000 కోట్ల ఆదాయం కోల్పోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అంత బాగోలేనప్పటికీ అదనపు ఆర్థిక భారం భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ నెల మొదట్లో కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించడంతో పెట్రోల్, డీజిల్ ధరలు రూ.2 చొప్పున తగ్గాయి. రాష్ట్రాలు కూడా తమవంతుగా వ్యాట్ తగ్గించుకోవాలని కేంద్రం ఇప్పటికే అన్ని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది.

## కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం



గువాహటి : అస్సాం గవర్నర్‌గా ప్రొఫెసర్ జగదీశ్ ముఖి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అజిత్ సింగ్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీమంత శంకరదేవ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి శర్వానంద సోనోవాల్, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జగదీశ్ ముఖి గతంలో అండమాన్, నికోబార్ దీవులకు లెఫ్టినెంట్ గవర్నర్‌గా పని చేశారు. అస్సాం గవర్నర్‌గా ఇప్పటి వరకు పని చేసిన బన్వరీలాల్ పురోహిత్ తమిళనాడు గవర్నర్‌గా నియమితులైన సంగతి తెలిసిందే

## దినకరన్‌కు స్వల్ప ఊరటనిచ్చిన హైకోర్టు



చెన్నై : అన్నా డీఎంకే బహిష్కృత నేత దినకరన్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. ప్రభుత్వ వ్యతిరేక కరపత్రాల కేసులో ఆయనపై ఈ నెల 24 వరకు ఎటువంటి చర్యలను తీసుకోరాదని ఆదేశించింది. దినకరన్‌తోపాటు మరో 16 మంది ఈ కేసులో దేశద్రోహం ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఐపీసీ సెక్షన్ 142ఏ ప్రకారం వీరిపై తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేశారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారన్న ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దినకరన్ మద్దతుదారులు సేలం జిల్లాలో ఈ కరపత్రాలను పంపిణీ చేసినట్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం స్తంభింపజేసిన అన్నా డీఎంకే ఎన్నికల గుర్తు రెండు ఆకులును ఈ కరపత్రాలపై ముద్రించారని పేర్కొన్నారు.

## అమిత్ షా తనయుడిపై ఆరోపణలు నిరాధారం : రాజ్‌నాథ్

న్యూఢిల్లీ : బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అండగా నిలిచారు. అమిత్ షా కుమారుడు జే షాపై వస్తున్న ఆరోపణలు నిరాధారమని, వీటిపై దర్యాప్తు అవసరం లేదని రాజ్‌నాథ్ చెప్పారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నూతన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

జే షాపై ఆరోపణలను ప్రస్తావించినపుడు రాజ్‌నాథ్ మాట్లాడుతూ ఈ ఆరోపణలు నిరాధారమని చెప్పారు. ఇటువంటి ఆరోపణలు గతంలో కూడా వచ్చాయని, అలా వస్తూనే ఉంటాయని అన్నారు.

బీజేపీ 2014లో అధికారంలోకి వచ్చిన అనంతరం జే షా యాజమాన్యంలోని సంస్థ టర్నోవరు భారీగా పెరిగిందని ఓ న్యూస్ పోర్టల్ కథనం ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను బీజేపీ, అమిత్ షా కుమారుడు జే ఖండించారు. ఇది తప్పుడు కథనమని, అవమానకరమని, పరువు నష్టం కలిగించేదని ఆరోపించారు.

## కదిలే రైల్లో వేలాడుతూ.. కత్తులతో వీరంగం

చెన్నై : కదులుతున్న రైల్లో ద్వారానికి వేలాడటమేగాక.. మరో చేత్తో కత్తులు పట్టుకుని వీరంగం సృష్టించారు కొందరు యువకులు. తమిళనాడు రాజధాని చెన్నైలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో స్పందించిన పోలీసులు నలుగురు యువకులను అరెస్టు చేశారు.

చెన్నైలోని లోకల్ రైలులో ప్రయాణిస్తున్న కొందరు యువకులు చేతుల్లో కత్తులు, రాడ్లు పట్టుకుని హల్‌చల్ చేశారు. ఒక చేత్తో రైలును పట్టుకుని వేలాడుతూ.. మరో చేత్తో కత్తులను తిప్పుతూ వీరంగం సృష్టించారు. రైలు దిగిన తర్వాత కూడా స్టేషన్లో బాణసంచా పేల్చారు. దీనికి సంబంధించి ఓ వీడియో సోషల్‌మీడియాలో వె%రల్ అయ్యింది.

ఇది కాస్తా పోలీసుల దాకా చేరడంతో వారు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు యువకులను ప్రశ్నిస్తున్నామన్నారు. వీరంతా ఓ ప్రభుత్వ కాలేజీకి చెందిన విద్యార్థులుగా గుర్తించారు. వీరిలో ఓ విద్యార్థి సదరు వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటన ఎప్పుడు జరిగిందో ఇంకా స్పష్టత రాలేదని.. విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## కవి సమయం

### 'నిస్వార్థ జీవనం'

ఎల్లలు లేకుండా పోతున్న మానవుల స్వార్థం
ఈ సృష్టిలో వున్న ప్రతీ వస్తువునూ
తానే పూర్తిగా అనుభవించాలన్న స్వార్థం
డబ్బు సంపాదన కోసం కష్టిస్తూ
సంపాదించిన డబ్బును అనుభవించక
ఆస్తులు, అంతస్తుల రూపంలో కూడబెట్టి
జీవితపు చరమాంకంలో దాయాదులకు అర్పణం
ధనార్జనలో మానవ సంబంధాలన్నీ దూరం
మమతానురాగాలకు, ఆప్యాయతానుభవాలకు లేదు స్థానం
స్వార్థ చింతన విషం కంటే ప్రమాదపూరితం
మానవులను అథ:పాతాళానికి క్రుంగదీయును
ఒక్క విషపు చుక్క కడివెడు పాలను విరుచునట్లు
ఒక్క స్వార్థపు ఆలోచన ప్రశాంతంగా వుండే మనస్సును
కల్లోల భరితం, అతలాకుతలం చేయును
నిస్వార్థ జీవనమే అందమైన జీవితానికి సోపానం

...కవితా రచయిత
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665


## పంచాంగం

మాసం : అశ్వీయుజ ; తిథి : షష్ఠి మ.12.38; మృగశిర మ.2.36; రా.వ.10.24ల 11.53.

బుధవారం 11-10-2017

**మేషం** : వృత్తుల వారికి శ్రమాధిక్యత మినహా ప్రతిఫలం ఆశించినంతగా ఉండదు. ప్రైవేటు సంస్థల్లో వారికి సదవకాశాలు లభిస్తాయి. స్నేహ పరిచయాలు విస్తరిస్తాయి. ఐరన్, సిమెంటు, కలప వ్యాపారస్తులకు కలసి వచ్చే కాలం. ఎదుటివారికి వాహనం ఇచ్చి ఇబ్బందులకు గురికాకండి. మీ వక్చాతుర్యానికి, మంచితనానికి గుర్తింపు లభిస్తుంది. కొత్త పరిచయాలు ఏర్పడతాయి. తప్పవు. స్త్రీలకు అయిన వారి నుంచి అందిన సమాచారం ఆందోళన కలిగిస్తుంది. **వృషభం** : కాంట్రాక్టర్లకు చేపట్టిన పనుల్లో ఏకాగ్రత ముఖ్యం. ఉల్లి, బెల్లం, పసుపు, కంది, మిర్చి వ్యాపారస్తులకు, స్టాకిస్టులకు ఆశాజనకం. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల్లో వారికి నూతన ఆలోచనలు స్ఫురించగలవు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు నిరంతర కృషి అవసరమని గ్రహించండి. ఆలయాలను సందర్శిస్తారు. **మిథునం** : రాజకీయాల్లో వారికి విరోధులు వేసే పథకాలు ఎంతో ఆందోళన కలిగిస్తాయి. ఆకస్మికంగా మీ కార్యక్రమాలు వాయిదా పడే ఆస్కారం ఉంది. టెక్నికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ రంగాల వారికి ఒత్తిడి తప్పదు. ప్రముఖులను కలుసుకోగలరు. భాగస్వాముల మధ్య ఆసక్తికరమైన విషయాలు చర్చకురాగలవు. **కర్కాటకం** : ఆర్థిక విషయాలలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉద్యోగస్తుల తొందరపాటు నిర్ణయాల వల్ల సమస్యలు ఎదుర్కొంటారు. మీ కళత్ర మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. కోర్టు వ్యవహారాలలో ఒత్తిడి, చికాకులు ఎదుర్కొంటారు. మీ సంతానం కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసి వస్తుంది. **సింహం** : కాంట్రాక్టర్లకు మంచి మంచి అవకాశాలు లభించినా సద్వినియోగం చేసుకోలేరు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఇతరులను సహాయం అర్థించి భంగపాటుకు గురవుతారు. ప్రతి వ్యవహారం మీరు చూసుకోవలసి వస్తుంది. చేపట్టిన పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. **కన్య** : అసాధ్యమనుకున్న దానిని సాధించి మీ సత్తా చాటుకుంటారు. స్త్రీలు అనవసర విషయాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. ధనవ్యయం, పట్టుదలతో శ్రమిస్తేనే కొన్ని పనులు సానుకూలమవుతాయి. గృహంలో చికాకులు తొలిగి ప్రశాంతత నెలకొంటుంది. ఏ వ్యక్తినీ తక్కువ అంచనా వేయటం మంచిదికాదు. **తుల** : రాజకీయాల్లో వారికి విరోధులు వేసే పథకాలు ఆందోళన కలిగిస్తాయి. స్త్రీల మనోభావాలు వ్యక్తం చేయడం వల్ల అశాంతికి గురవుతారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లకు మెళకువ అవసరం. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి నిరుత్సాహం తప్పదు. **వృశ్చికం** : బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంలో మెలకువ వహించండి. ఇతరుల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోకండి. శత్రువులపై విజయం సాధిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తికరంగా సాగు తాయి. తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కోక తప్పదు. **ధనుస్సు** : రాజకీయ నాయకులు తరచూ సభ సమావేశాల్లో పాల్గొంటారు. టక్నికల్, కంప్యూటర్ రంగాలలో వారికి సంతృప్తి కానరాగలదు. దా ధర్మాలు చేయడం వల్ల మీ కీర్తి ప్రతిష్టలు ఇనుమడిస్తాయి. మీ ప్రయత్నాలకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లభిస్తుంది. వైద్యులకు అభివృద్ధి కానరాగలదు. **మకరం** : ఆర్థిక పరిస్థితిలో ఆశిస్తున్న మార్పులు సంభవిస్తాయి. పాత సమస్యల పరిష్కారంతో మానసికంగా కుదుటపడతారు. నిరుద్యోగులు నిరుత్సాహం వీడి ఇంటర్వ్యూలకు హాజరు కావడం మంచిది. వృత్తిపరంగా ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. రాజకీయాలలో వారికి మెళకువ అవసరం. **కుంభం** : దంపతుల మధ్య కలహాలు తలెత్తుతాయి. కోర్టు వ్యవహారాలు పరిష్కార దిశగా నడుస్తాయి. మీ సంతానం కోసం ధనం అధికంగా వ్యయం చేస్తారు. బంధుమిత్రులతో కలిసి ఆలయాలను సందర్శిస్తారు. కొబ్బరి, పండ్లు, పూలు, చల్లని పానీయ వ్యాపారులకు లాభ దాయకంగా ఉంటుంది. **మీనం** :ఆర్థిక లావాదేవీల్లో తలెత్తిన వివాదాలను తెలివిగా పరిష్కరిస్తారు. అవగాహన లేని విషయాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికం. మీ శ్రీమతి వ్యాఖ్యలు మీపై మంచి ప్రభావం చూపుతాయి.

# స్వామి కన్నా నామమే మిన్న



అయోధ్యా నగరంలో శ్రీరామచంద్ర భగవానుడు రాజ దర్బారులో విరాజిల్లుతున్నాడు. దేవర్షి నారదుడు, విశ్వా మిత్రుడు, వశిష్ఠాది మహర్షులెందరో ఉన్న ఆ సభలో ఒక ధార్మిక విషయం మీద చర్చ కొనసాగుతోంది. ఉన్నట్టుండి నారద మహర్షిభగవంతుడు గొప్పవాడా? భగవన్నామం గొప్పదా? అన్న సమస్యను లేవనెత్తాడు. దానిపై అక్కడ వాగ్వివాదం చెలరేగింది. కాలం గడుస్తున్నదే గాని ఋషి గణం ఒక నిర్ణయానికి రాలేకపోయారు. అదే సమయంలో హనుమంతుడు ఆ సభలోకి అడుగుపెట్టాడు. అతన్ని చూడగానే దేవర్షి మదిలో ఓ ఆలోచన మెరిసింది.

వెంటనే ఆయన వాయు పుత్రుని వద్దకెళ్ళి, మహావీరా! ఇప్పుడు నీవు శ్రీరామునితోబాటు ఋషి వర్యులందరికీ నమస్కరించు. ఒక్క విశ్వామిత్రునికి మాత్రం నమస్కరించవద్దు. కారణం తర్వాత చెబుతాను అన్నాడు. నారదుని మాట కాదనలేక ఆయన చెప్పినట్టు చేశాడు హనుమ. విశ్వామిత్ర మహర్షి మనస్సు చివుక్కుమంది. అది కనిపెట్టిన నారదుడు ఒక్క అంగలో విశ్వామిత్రుని చెంత చేరి, మహర్షీ! హనుమంతునికి ఎంత గర్వమో చూశారా? నిండు సభలో మీకు తప్ప అందరికీ నమస్కరించాడు. మీరు తక్షణం అతడిని శిక్షింపజేయాలి! అన్నాడు.

**దాంతో విశ్వామిత్రుడు అగ్నిహోత్రుడయ్యాడు.**

**ఆయన శ్రీరాముని సమీపించి, రాజా! నీకళ్ళెదుటే**

ఆంజనేయుడు నన్ను ఘోరంగా అవమానించాడు. కనుక రేపు సూర్యుడు అస్తమించే లోగా నీ చేతులతో అతనికి మరణదండన

విధించాలి! అని ఆజ్ఞాపించాడు. శ్రీరాముడు నిశ్చేష్ట డయ్యాడు... అనన్య భక్తుడైన మారుతికి మరణదండన విధిం చడమా?... ఇది తనకు సాధ్యమయ్యే పనేనా... ఏమిటీ సంకట పరిస్థితి?... చాలాసేపు మదనపడి చివరకు గురువాజ్ఞ పాటించక తప్పదని నిర్ణయించుకున్నాడాయన. ఈ విషయం కొద్దిసేపట్లోనే నగరమంతా వ్యాపించింది. హనుమంతునికి మహాదుఃఖం కలిగింది. నారదుని చూస్తూ దేవర్షీ! మీరు చెప్పినట్టు చేసినందుకు ఇదా ఫలితం? భగవానుడు రేపు నన్ను వధిస్తాడు. ఇప్పుడు నేనేం చెయ్యాలి? అన్నాడు రుద్ధమైన కంఠంతో. అప్పుడు నారదుడు హనుమంతా! భయపడకు.

రేపు బ్రహ్మ ముహూర్తంలో సరయూ నదిలో స్నానంచేసి, చేతులు జోడించి శ్రీరామ జయ రామ జయ జయ రామ అని జపించు. విశ్వాస పూర్వకంగా చెబుతున్నాను. నీకెటువంటి ప్రమాదం జరగదు! అని అభయమిచ్చాడు. మరునాడు సూర్యోదయానికి పూర్వమే హనుమంతుడు సరయూ నదీ తీరానికి వచ్చాడు. స్నానమాచరించి నారద మహర్షి చెప్పిన విధంగా రామనామాన్ని జపించసాగాడు. జరగబోయే సంఘటన తిలకిం చడానికి మహర్షులతోబాటు అశేష జనం అక్కడికి వచ్చారు.

శ్రీరాముడు హనుమంతునికి కొంత దూరంలో నిలబడి, కరుణార్ద్ర దృష్టితో చూస్తూ, అనిచ్ఛాపూర్వకంగానే అతడిపై బాణాలను వర్షింపసాగాడు. అలా సూర్యాస్తమయం వరకూ శ్రీరాముడు బాణాలు వర్షింపజేస్తున్నా ఏ ఒక్కటీ శ్రీ రామనామం జపిస్తున్న మారుతిని బాధించలేకపోయింది. కుంభకర్ణాది మహారాక్షసులను వధించడంలో ఉపయోగించిన భయంకరాస్త్రాలు కూడా నిరుప యోగమయ్యాయి.

ఇలా కాదని శ్రీరామ భగవానుడు బ్రహ్మాస్త్రాన్ని ఎత్తాడు. హనుమ చిరునవ్వుతో శ్రీరాముని చూస్తూ ఆత్మసమర్పణ చేసి, పూర్ణభావంతో ఆయన నామాన్ని జపిస్తూ స్థిరచిత్తంతో నిలబడిపోయాడు. పరిస్థితి గమనించిన నారదుడు విశ్వామిత్రుని చూస్తూ, మహర్షీ! ఇక మీరు మారుతిపై కోపాన్ని ఉపసంహ రించుకొని బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని నివారించండి. ఇప్పటికే శ్రీరాముడు అలసిపోయి ఉన్నాడు. ఇక్కడున్న అశేష జనవాహినితోపాటు మీరుకూడా శ్రీరామనామ మహిమను ప్రత్యక్షంగా చూశారు కదా! అన్నాడు చిరుదరహాసంతో. భగ వంతుని కంటే భగవన్నామమే మిన్న అయినదని విశ్వా మిత్రునితోపాటు అక్కడున్న యావన్మందికీ అర్థమైంది.

అది నిరూపించడానికే నారదుడీ గొడవను సృష్టించాడని తేటతెల్లమైంది... విశ్వామిత్రుడు శ్రీరాముని చేత బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని విరమింపజేశాడు. ఆనందంతో వచ్చి వాయుపుత్రుడు తన ప్రభువు చరణకమలాలపై వ్రాలిపోయాడు. పిమ్మట విశ్వామిత్రునికి ప్రణమిల్లాడు. ప్రసన్న వదనంతో విశ్వామిత్ర మహర్షి హనుమను ఆశీర్వదించి- సంపూర్ణ శ్రద్ధాభక్తులతో శ్రీరామనామాన్ని జపించేవారికి సర్వపాపాలు హరించబడతాయనీ, సకల శుభాలు కలుగుతాయని ప్రవచిం చాడు.

అందుకే అడుగడుగునా ఈ కలియుగంలో పాపారాశులే కనబడుతున్నా సరే శ్రీరామ నామాన్ని జపిస్తే చాలు ఆ పాపరాశులు మనలను అంటవు. నిరంతరమూ రామనామంతో మనసు, తనువు పులకించేలా జపం చేయగలగాలి. ప్రహ్లాదుడు చెప్పినట్టుగా తింటున్నా, తాగుతున్నా, నిద్రిస్తున్నా, నడుస్తున్నా సరే ఎపుడైనా భగవంతుని నామాన్ని మాత్రం వదలరాదు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# తితిదే భద్రతా వ్యవస్థపై అవగాహన శ్రీవారి సేవలో యువ ఐపీఎస్‌ల



తిరుమల : ఉత్తర్‌ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 12 మంది శిక్షణ పొందుతున్న ఐపీఎస్ అధికారులకు తిరుమల, తిరుపతి దేవస్థానం భద్రతా వ్యవస్థపై అవగాహన కల్పించారు. తితిదే సీవీఎస్‌వో రవికృష్ణ తన క్యాంపు కార్యాలయంలో వీరికి ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేస్తున్న భక్తులకు భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసిన ఏర్పాట్లను రవికృష్ణ వివరించారు. అలిపిరిలోని భద్రతా వలయంలో స్కానర్లతో లగేజీని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న వైనాన్ని తెలిపారు. శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించే సమయంలోనూ లగేజీని స్కానర్ల ద్వారా పరిశీలిస్తామన్నారు. మూడంచెల భద్రతా వ్యవస్థ, రద్దీ సమయంలో భక్తుల క్రమబద్ధీకరణ చర్యలు, సీసీటీవీల వినియోగం, కామన్ కమాండ్ కంట్రోల్ కేంద్రం పనితీరు, నిఘా పద్ధతులపై వారికి అవగాహన కల్పించారు. సమావేశంలో వీఎస్‌వో రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు ఈ బృందం శ్రీవారిని దర్శించుకుంది.

## వీవీఐపీల భద్రత కీలకం: రూరల్ ఎస్పీ

గుంటూరు : జిల్లాలో వీవీఐపీలు, వీఐపీల పర్యటించనున్న నేపథ్యంలో వారి భద్రత ఎంతో కీలకమని రూరల్ ఎస్పీ అప్పలనాయుడు అన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్ కానిస్టేబులు (ఏఆర్ హెచ్‌సీ) నుంచి ఏఆర్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లు (ఏఆర్ఎస్ఐ)గా ఉద్యోగోన్నతి పొందిన ముగ్గురు రూరల్ ఎస్పీ వద్ద రిపోర్టు చేశారు. ప్రకాశం జిల్లా నుంచి ఉద్యోగోన్నతిపై గుంటూరు రూరల్‌కు వచ్చిన ఎ.శ్రీనివాసరావు, డి.రాంబాబు, జి.శ్రీనివాసరావులకు ఎస్పీ పోస్టింగ్‌లు వేసే..శాఖకు ప్రతిష్ఠ తెచ్చేలా పనిచేయాలని చెప్పి వారికి అభినందనలు తెలిపారు.

## అన్నమయ్య జలాశయం నాలుగు గేట్లు ఎత్తివేత 10 వేల క్యూసెక్కులు విడుదల

రాజంపేట : మండలంలోని అన్నమయ్య జలాశయానికి భారీగా వరద నీరు చేరడంతో నాలుగు గేట్లను ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పింఛ, మాండవ్యనదుల నుంచి భారీగా నీరు జలాశయంలోకి చేరుతోంది. దీంతో సామర్థ్యం మేరకు నిల్వ చేసుకుని మిగతా వచ్చిన నీటిని వచ్చినట్లు గేట్ల ద్వారా కిందికి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ రమేష్ తెలిపారు. ప్రాజెక్టులో నాలుగు గేట్లును ఎత్తినట్లు ఈఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 203.20 మీటర్ల మేర నీటి నిల్వ చేసినట్లు చెప్పారు. తమ సిబ్బంది అప్రమతంగా ఉన్నారని, ఎప్పటికప్పుడు ప్రాజెక్టులోకి వస్తున్న నీటిని అంచనా వేస్తూ కిందకు విడుదల చేస్తున్నామని వెల్లడించారు.

## చంద్రన్న బీమాకు మంచి ప్రచారం వస్తోంది

### శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు

సత్తెనపల్లి : రాష్ట్రంలో బలమైన ఆర్థిక వ్యవస్థ డ్వాక్రా మహిళలు రుపాంతరం చెందుతున్నారని శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సత్తెనపల్లి, నరసరావుపేట, పెదకూరపాడు నియోజక వరాల యానిమేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు డ్వాక్రా ఉద్యమం విస్తృతమైందని సభాపతి గుర్తు చేశారు. అప్పట్లో 74 వేలుగా ఉన్న సంఘాల్ని 50 లక్షలకు తాను ..ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధతో పెంచినట్లు చెప్పారు. ఒకప్పుడు మహిళలకు రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు సవాలక్ష ప్రశ్నలు అడిగే వారని, పైసలు విదిల్చేందుకు ముందుకు వచ్చేవారు కాదన్నారు. ఇప్పుడు అందరికంటే డ్వాక్రా మహిళలకే వారు విరివిగా రుణాల్ని అందజేస్తున్నారని చెప్పారు. వేల కోట్ల రుణమాఫీకి రాని ప్రచారం రూ.15 సభ్యత్వంతో అమలు చేస్తున్న చంద్రన్న బీమా పథకానికి వస్తోందన్నారు. రూ.15 బీమాతో రూ.5 లక్షల ధీమాను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అన్ని శాఖల కంటే మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సభాపతి చెప్పారు. జిల్లాలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.23.90 కోట్లు, స్త్రీనిధి పథకం ద్వారా రూ.26 కోట్లు, బ్యాంకు లింకేజీగా రూ.174 కోట్లను ఈ ఏడాది డ్వాక్రా మహిళలకు అందించడం జరిగిందన్నారు.

## 50 వేల ఎకరాలకు సాగునీరు ఇప్పించకపోతే

# జగన్‌పై పోటీ చేయను

### సతీష్‌రెడ్డి ప్రకటన



వేంపల్లె : పులివెందుల నియోజకవర్గంలో కనీసం 50 వేల ఎకరాలకు సాగునీరు ఇప్పించకపోతే తాను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌పై పోటీ చేయనని శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి అన్నారు. ఆయన పాపఘ్నినదిలో వరదనీటి ఉద్ధృతిని పరిశీలించారు. నదిలో తెగిపోయిన అలిరెడ్డిపల్లె రోడ్డును పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని నదులు, చెరువులకు జలకళ రావడం సంతోషకరమన్నారు. ఈ దఫా పులివెందుల నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరు ఇప్పించాలని తాను విశ్వప్రయత్నాలు చేస్తున్నానన్నారు. ఈ విషయమై మంగళవారం విజయవాడలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా మంత్రి ఆదినారాయణరెడ్డి నేతృత్వంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ అధికారులు సమీక్ష సమావేశం ఏర్పాటైనట్టు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేకించి పులివెందుల రైతులకు ఏమేరకు మేలు చేయాలన్న విషయమై సమగ్రంగా చర్చిస్తామన్నారు. తాను లక్ష ఎకరాలకు నీరందించేలా చూడాలని ప్రయత్నిస్తున్నానని, కనీసం 50 వేల ఎకరాలకు నీరందించకపోతే వచ్చే ఎన్నికల్లో జగన్‌పై పోటీచేసే ప్రశ్నే లేదన్నారు. పాపఘ్నినదిలో వరదనీటి ఉద్ధృతి తగ్గిన వెంటనే తాత్కాలికంగా రోడ్డు వేయిస్తామన్నారు. జీఎస్టీ సమస్య వల్ల హైలెవెల్ వంతెన నిర్మాణానికి నిధుల మంజూరులో జాప్యం జరుగుతోందన్నారు. దీనిపై కూడా ఆయా శాఖల అధికారులతో మాట్లాడానని, త్వరలోనే హైలెవెల్ వంతెన నిర్మాణానికి రూ.30.50 కోట్లు విడుదలవుతాయన్నారు. ఆయన వెంట కుమ్మ రాంపల్లె సర్పంచి భారతి భాస్కర్‌రెడ్డి, బాల స్వామిరెడ్డి, షబ్బీర్, వృషభాచలేశ్వర దేవస్థానం ఛైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని హుండీ ఆదాయం రూ.48.53 లక్షలు



కాణిపాకం : స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారికి హుండీల లెక్కింపు ద్వారా రూ.48,53,781 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు తెలిపారు. గడచిన 18 రోజుల్లో స్వామివారికి ఈ ఆదాయం వచ్చినట్లు ఈవో వివరించారు. ఆలయ ఆస్థాన మండపంలో హుండీల లెక్కింపు చేపట్టారు. హుండీల లెక్కింపు ద్వారా 40 గ్రాముల బంగారం, 335 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా రూ.2,771 ఆదాయం వచ్చిందన్నారు. 331 యూఎస్ఏ, 10 ఆస్ట్రేలియా డాలర్లు వచ్చినట్లు తెలిపారు. రూ.23.5 వేలు రద్దు చేసిన రూ.వెయ్యి, రూ.500 నోట్లు వచ్చాయన్నారు. బంగారు రథం హుండీ ద్వారా రూ.8,60,685 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. 24 గ్రాముల బంగారం, 120 గ్రాముల వెండి వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఏసీ హెచ్‌జీ వెంకటేష్, ఏఈవోలు కేశవరావు, రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు స్వాములు, ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రఘునాథరెడ్డి, ఆలయ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాతలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

### శాసన మండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రెడ్డిసుబ్రహ్మణ్యం




ఐ.పోలవరం : అన్నదాతను అన్నివిధాలుగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్తోందని శాసన మండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రెడ్డిసుబ్రహ్మణ్యం అన్నారు. జిల్లాలో ముడో విడత రుణమాఫీ పంపిణీకి ఐ.పోలవరం మండలం మురమళ్లలో కలెక్టర్ కార్తికేయ మిశ్రాతో కలసి ఆయన శ్రీకారం చుట్టారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో రెడ్డిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మున్ముందు రైతులకు మరింత లబ్ధి అందజేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. చంద్రబాబు సారథ్యంలోని తెదేపా ప్రభుత్వం జిల్లాలో రూ. 1309 కోట్ల రుణమాఫీ చేయగా ఇంతవరకూ రెండు విడతల్లో రూ. 786.35 కోట్లు అందించిందన్నారు. మూడో విడతగా ఇప్పుడు రూ.175.93 కోట్ల నిధులు విడుదలైనట్లు చెప్పారు. తద్వారా జిల్లాలో 2.50లక్షల మంది రుణవిముక్తిలవుతారని చెప్పారు. ఇంకా 346.72 కోట్ల మేర రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. దీనినికూడా నాలుగో విడతలో పూర్తిచేస్తామని చెప్పారు. డ్వాక్రా మహిళలకు రూ.10వేలు మాఫీ హామీని కూడా చంద్రబాబు నిలుపుకుని ఇప్పటివరకూ రూ. ఆరు వేల వరకూ మాఫీ చేశారని మిగతా రూ.4వేలు కూడా మాఫీ చేస్తారని వెల్లడించారు. అంతకుముందు కలెక్టర్ కార్తికేయ మిశ్రా తొలుత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూడోవిడత రుణమాఫీని రెండు మూడు రోజుల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. ఎదైనా ఇబ్బందులుంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. అమలాపురం ఎంపీ పండుల రవీంద్రబాబు మాట్లాడుతూ రైతుల కోసం రాష్ట్రప్రభుత్వం ఎంతగానో శ్రమిస్తోందన్నారు. ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ రైతులకు అన్నివిధాలుగా మేలుజరిగేలా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం రుణమాఫీ చెక్కును విడుదల చేసి రైతులకు రుణవిమోచన పత్రాలను అందజేశారు. లబ్ధిదారులకు రాయితీపై మంజూరు చేసిన ట్రాక్టర్‌లను లబ్ధిదారులకు అందజేసి ఆదర్శ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు నామన రాంబాబు, డీసీసీబీ ఛైర్మన్ వరుపుల రాజా, వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ప్రసాద్. జేసీ2 రాధాకృష్ణ, ఏపీడీ మల్లిబాబు, రైతుసాధికార సంస్థ పరిశీలకులు పీహెచ్‌బీబీ. త్రినాథ్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, పేరాబత్తుల రాజశేఖర్, సాగిరాజు సూరిబాబు, పలుశాఖల అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దాడులు ఆపాలంటూ ధర్నా




గాంధీనగర్ : దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్, భాజపా ఆగడాలు నశించాలని నిరసన తెలుపుతూ సోమవారం భానుగుడి సెంటర్‌లో వామపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మతసామరస్యం, లౌకికవాదం వర్థిల్లాలంటూ, మేధావులు, సాహితీవేత్తలు, దళితులు, జర్నలిస్టు లపై దాడులు ఆపాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దువ్వా శేషబాబ్జి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు జె.వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, లిబరేషన్ నాయకులు సిహెచ్.నాగేశ్వరరావు, ఆర్‌పీఐ నాయకులు ఎ.రామేశ్వరరావు, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా, కేవీపీఎస్ నగరాధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, శ్రామిక మహిళా నేత బేబిరాణి తదితరులు పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ ప్రశ్నిస్తున్న వారిపై దాడులకు పాల్పడటం, దేశద్రోహులుగా ముద్రవేయడం, హత్యలు చేయడం దారుణమన్నారు. గో రక్షణ పేరుతో మైనార్టీలపైనా, ఆవు చర్మం పేరుతో దళితులపైన దాడులకు పాల్పడుతున్నారన్నారు. నోట్లరద్దు, జీఎస్టీ విఫలమై ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని, చిరు వ్యాపారులు నానాయాతన పడుతున్నారన్నారు. ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి సీపీఎం కార్యకర్తలపైన, కార్యాలయాలపైనా దాడులు చేస్తున్నారన్నారు. ధర్నాలో న్యూడెమోక్రసీ నాయకులు రామన్న, రాజబాబు, సీపీఐ నాయకులు తోకల ప్రసాద్, జె.కుమార్, డేవిడ్‌రాజు, వెంకట్రావు, వీరలక్ష్మి, పలివెల వీరబాబు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ప్రారంభమైన మిర్చి కొనుగోళ్లు

### మొదటి రోజు నామమాత్రంగా క్రయవిక్రయాలు



గుంటూరు : గుంటూరు మిర్చియార్డులో ఎట్టకేలకు మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ-నామ్‌ను వ్యతిరేకిస్తూ ఎగుమతి, దిగుమతి వ్యాపారులు సుమారు 40 రోజులుగా బంద్ నిర్వహిస్తూ క్రయవిక్రయాలను పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వం ఏమాత్రం దిగి రాకపోవడం, మార్కెటింగ్ శాఖ అధికారులు క్రయవిక్రయాలు జరపకపోతే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్న హెచ్చరికలతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యాపారులు దారికి రాక తప్పలేదు. మిర్చియార్డులో ఈ-నామ్ కింద మొదటిరోజు కొనుగోళ్లు నామమాత్రంగా జరిగాయి. పారదర్శకంగా మిర్చి కొనుగోళ్లు జరిగితే అధిక కమీషన్ వసూలు చేయడం, బిల్లు టు బిల్లు, కటింగ్, జీరో వ్యాపారాలకు అడ్డుకట్ట పడుతుందని, ఇవన్నీ లేకపోతే ఎక్కడ తమ అధిక రాబడికి గండి పడుతుందోనన్న అత్యాశకు పోయిన వ్యాపారులు సహకరిచండంలేదు.

సెప్టెంబర్ 1న ఈ నామ్ మిర్చియార్డులో అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఒక్క రోజు కూడా లావాదేవీలు జరగలేదు. గత నెల ప్రథమార్ధంలో మంత్రులు, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు, పాలకవర్గంతో సమావేశమైన మిర్చి ఎగుమతి, దిగుమతి సంఘాల నాయకులు కొన్ని మినహాయింపులు ఇస్తే ఈ-నామ్‌కు సహకరిస్తామని ఒప్పుకుని వచ్చారు. అయితే మిర్చి వ్యాపారుల్లో ఆధిపత్య పోరు, పాలకవర్గంతో పొసగకపోవడం వల్ల ఉద్దేశపూర్వకంగా సహకరించకుండా రోజులు వెళ్లబుచ్చారు. గత నెల అంతా సమావేశాలతోనే పొద్దుపొచ్చారు. ప్రభుత్వమే దిగి వచ్చి ఇంకా మినహాయింపులు ఇస్తుందేమోనని ఎదురుతెన్నులు చూశారు. ప్రస్తుతం అన్ సీజన్ కావడం, రైతుల నుంచి కూడా పెద్దగా ఒత్తిడి లేకపోవడం, వీటన్నింటినీ మించి దీనిని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం వల్ల ఇందులో చేయగలిగేది ఏమీ లేదని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు సైతం చేతులెత్తేశారు. చివరకు మార్కెటింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వద్దకు పంచాయితీ చేరినా ఆయన కూడా కొనుగోళ్లు నిర్వహించాల్సిందేనని తెగేసి చెప్పారు. డిసెంబర్ 31 వరకు రైతులకు పెట్టిన పెట్టుబడులు సొమ్మును మినహాయించుకుని మిగతాది ఆన్‌లైన్‌లో జమ చేయాలని, రెండు బిడ్డింగులు వేయాల్సిందేనని, రైతుల్లో ఎంతమందికి ఏవిధంగా పెట్టుబడులు పెట్టారో మండలాల వారీగా జాబితా ఇవ్వమని ఆయన వ్యాపారులకు సూచించారు. ఈ విధంగా ఇచ్చేందుకు కూడా వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రత్యేక కార్యదర్శి సూచించిన విధంగా అంగీకారం తెలియజేయకపోవడం వల్ల ఇప్పుడు డిసెంబర్ వరకైనా మినహాయింపు ఉంటుందో, ఉండదోనన్న భయం వ్యాపారుల్లో వెంటాడుతోంది. దాదాపు 40 రోజులుగా క్రయవిక్రయాలు నిలిచిపోవడం వల్ల చిన్నాచితకా వ్యాపారులతో పాటు ముఖ్యంగా కార్మికులు పూట గడవక ఇబ్బందులు పడ్డారు. వ్యాపారులు సమ్మె కారణంగా కనీసంగా 15 లక్షల మిర్చిబస్తాల లావాదేవీలు నిలిచిపోయాయి. ఇన్ని రోజులు సమ్మె చేసి ఏమి సాధించినట్లో అర్థం కావడంలేదని, అనవసరంగా మమ్మల్ని ఇబ్బందులు పాల్జేశారని చిరు వ్యాపారులతో పాటు హమాలీలు వాపోతున్నారు.

ఈ-నామ్ కింద కొనుగోళ్లు చేసేందుకు అరకొరగా వ్యాపారులు ముందుకు వచ్చారు. మొదటిరోజు 4,157 బస్తాలు అమ్మకానికి రాగా అందులో 3,782 అమ్మకాలు జరిగాయి. 66 లాట్లకు గాను 18 మంది ఎగుమతి వ్యాపారులు రెండు బిడ్డింగులు వేశారు. కొందరు రెండు బిడ్డింగులు వేసేందుకు ముందుకు రాకపోవడం వల్ల కొనుగోళ్లు మందకొడిగా జరిగాయి. రైతుల ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ తీసుకురావాలని సూచించడంతో కొందరు వెనుదిరిగి వెళ్లారు. మరికొందరు కమీషన్ ఏజెంట్ల వద్దే రైతుల ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ పత్రాలు ఉండటంతో నమోదు చేసుకుని బిడ్డింగ్ స్లిప్ ఇచ్చారు. రెండో బిడ్డింగ్ వేసేందుకు ఎగుమతి వ్యాపారులు మొదట్లో ముందుకు రాకపోవడంతో యార్డు కార్యదర్శి దివాకర్ వారితో చర్చలు జరిపి సందేహాలను నివృత్తి చేశారు. అయితే ఈ-నామ్‌పై రైతుల్లో అవగాహన నిమిత్తం కరపత్రాలు ప్రచురించి పంపిణీ చేయాలని, అదేవిధంగా యార్డులో మైకులో కూడా ప్రచారం చేయిస్తుండాలని వ్యాపారులు కోరుతున్నారు.

# ఈ-నామ్ వద్దంటూ రైతుల ఆందోళన

### తెనాలి మార్కెట్‌యార్డు వద్ద ఉత్కంఠ

తెనాలి : ఈ-నామ్ వద్దంటూ పెద్ద సంఖ్యలో రైతులు తెనాలి మార్కెట యార్డు వద్దకు చేరటంతో దాదాపు రెండు గంటల పాటు ఉత్కంఠ నెలకొంది. ఆ తర్వాత రైతులు, అధికారులు, పోలీసులు అందరూ సంయమనం పాటించటంతో పరిస్థితి చక్కబడింది. ఈ-నామ్ విధానం అమలు చేస్తామని యార్డు అధికారులు ముందుగానే ప్రకటించిన నేపథ్యంలో, పచ్చి సరుకు అయిన నిమ్మ రైతులకు ఈ విధానం నష్టమని, పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు మార్కెట యార్డు వద్దకు పెద్ద సంఖ్యలో చేరారు. యార్డు లోపల ఈనామ్ నిర్వహించే గది వద్ద తమ వ్యతిరేకతను తెలియచేస్తూ నినాదాలు చేశారు. అయితే యార్డు కార్యదర్శి గౌస్‌బాషా ఇతర అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనామ్ విధానంలో నిమ్మ అమ్మకాలు జరగాలని చెప్పటంతో రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కొంత ఉద్రిక్తత నెలకొంది. దీనితో ఈనామ్ గదికి అధికారులు తాళాలు వేశారు. ఆగ్రహంతో ఉన్న రైతులు ఒక్కసారిగా యార్డు ఎదుట రోడ్డెక్కి బైఠాయించారు. తెనాలి-గుంటూరు రోడ్డు ప్రదాన రహదారి అయినందున నిమిషాల్లోనే ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న డీఎస్పీ స్నేహిత, సీఐలు అశోక్‌కుమార్, శ్రీనివాసరావు, కల్యాణ రాజు, చినమల్లయ్య, ఇతర ఎస్సైలు ఘటనా స్థలికి చేరి రైతులతో మాట్లాడారు. వాహనాలు నిలిచిపోయినందున ఒక వైపు రోడ్డులో రాకపోకలు జరిగేలా సహకరించాలని పోలీసులు రైతులను కోరారు. అయితే వారు దానికి అంగీకరించలేదు. ఈ సందర్భంగా పోలీసులు-రైతుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా మార్కెట యార్డు ఛైర్మన్ గడవర్తి సుబ్బయ్య కూడా రైతులతో మాట్లాడారు. కార్యదర్శి, యార్డు ఛైర్మన్ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. వారు ఈనామ్ అమలు చేయాల్సిందేనని చెప్పటంతో, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను వీరివురూ అధి కారులకు వివరించారు. అటుపై ఈనామ్ విధానాన్ని తాత్కాలికంగా రెండు రోజులు నిలిపివేస్తున్నామని అధికారులు ప్రకటించటంతో రైతులు రాస్తారోకో విరమించారు. తాము కూడా విషయాన్ని ఉన్న తాధికారులకు తెలియచేయాల్సి ఉన్నందున మీరు కోరుకుంటున్న విషయాన్ని కారణాలను వివరంగా వినతి పత్రం రూపంలో రాసి ఇవ్వాలని గడవర్తి సుబ్బయ్య సూచించటంతో రైతు సంఘాల ప్రతినిధులు వినతిపత్రాన్ని తయారు చేసి వారికి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్నేని కేశవరావు ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో వ్యవ హరిస్తుందని విమర్శించారు. ఈ విధానం అమలయితే ఇక చిన్న వ్యాపారులు ఉండరని, అంతా కార్పొరేట మయం అయిపోతుందన్నారు. రైతులతో సమగ్రంగా జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి, వారి అభిప్రాయాలను సేకరించి వారు అంగీకరిస్తే అమలు చేయాలని, వద్దంటే ఆపేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ములకాశివసాంబిరెడ్డి, సురేష్‌బాబు, కృష్ణమూర్తి, యలమందయ్య, కోటేశ్వరరావు, సాంబిరెడ్డి తదితరులతో రైతులు పాల్గొన్నారు.

# కొవ్వు కరిగించే జీలకర్ర




ప్రతీరోజూ మనం వండుకునే పప్పు లేదా ఇతర కాయగూర వంటల్లో జీలకర్రను కలుపుతాం. కేవలం ఫ్లేవర్ కోసమే దీనిని కలుపుతారని చాలా మంది అనుకుంటారు. కాని దీని వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిస్తే ఆశ్చర్యం కలగడం ఖాయం. ముఖ్యంగా బరువు తగ్గించడంలో జీలకర్ర గణనీయమైన పాత్ర పోషిస్తుందట. శరీరంలో కొవ్వు శాతాన్ని తగ్గించి, చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించ గల సత్తా జీలకర్రకు ఉందట. జీలకర్రలో థైమోల్ అనే రసాయనంతోపాటు ఉండే కొన్ని ముఖ్యమైన ఆయిల్స్ శరీరంలో ఉండే కొవ్వును తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయట. అలాగే జీర్ణప్రక్రియను సులభతరం చేస్తాయట.

ఒక గ్లాస్ నీటికి ఒక టీ స్పూన్ జీలకర్ర కలిపి వేడి చేయాలి. ఆ నీరు బ్రౌన్ కలర్‌లోకి మారిన తర్వాత దాన్ని తిరిగి చల్లబర్చి తాగాలి. ఇలా రోజుకు మూడు సార్లు తాగితే డైజేషన్ సులభంగా అవుతుంది. అంతేకాకుండా బరువు తగ్గడం కూడా సులభమవుతుంది.

ఉదయాన్నే తాగే కాఫీలో ఓ స్పూను బట్టర్ (వెన్న)కలుపుకుని తాగితే బరువు తగ్గడానికి అవకాశం ఉంది అంటున్నారు పరిశోధకులు. వెన్న తింటే లావెక్కుతారు కదా? అన్న అనుమానాన్ని వారు కొట్టిపారేస్తున్నారు. కాఫీలో వెన్న కలుపుకుని తాగడం వల్ల ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంటుందనీ, కనీసం మరోసారి కాఫీ తాగాలనే కోరిక కూడా కలగదనీ వారు చెబుతున్నారు. దీని వల్ల అదనపు క్యాలరీల బెడద తగ్గుతుందని కూడా వారు స్పష్టం చేస్తున్నారు.

# బరువు తగ్గించే బట్టర్ కాఫీ



ఇదే విషయంపై కొంత మంది ఊబకాయుల మీద వారు పరిశోధనలు నిర్వహించారు. సుమారు వంద మందిని రెండు గ్రూపులుగా విభజించి ఒక గ్రూపు వారికి వెన్న కలిపిన కాఫీని, మరొకరికి మామూలు కాఫీని ఇచ్చారు. కొన్ని నెలల అనంతరం రెండు గ్రూపుల బరువును పరిశీలించగా వెన్నకాఫీ తాగిన వారి బరువులో స్వల్ప మార్పు కనిపించగా, మామూలు కాఫీ తాగిన వారు కొద్దిగా బరువు పెరగడాన్ని వారు గుర్తించారు. వెన్న కాఫీ తాగిన వారిలో ఆహారం తీసుకోవాలన్న కోరిక కలగకపోవడం, గతం కన్నా వారి మెదడు చురుకుగా పనిచేయడాన్ని వారు కనుగొన్నారు. వెన్న కాఫీలో చక్కెరకు బదులుగా వెన్న కలుపుకోవాలనీ, అది కూడా వెన్న కలిపిన వెంటనే కాఫీ తాగేయాలనీ, నెయ్యి పైకి తేలేంత వరకూ ఆగకూడదనీ వారు సూచిస్తున్నారు.

# హాయిగా నిదురపో...

*నిద్ర మనలోని చికాకులన్నింటినీ తరిమేసే అద్భుత ఔషధం. కానీ కొందరు నిద్రలేమితో సతమతమవుతుంటారు. సాధారణంగా ప్రతీవ్యక్తికీ ఆరునుండి ఎనిమిది గంటల నిద్ర అవసరం. అయితే స్త్రీలకు మరోగంట అదనంగా నిద్ర అవసరం. ఇది పరిశోధనల్లో తేలిన అంశం. ఆడవారికి శ్రమతో పాటు ఆందోళనా అధికంగానే ఉంటుంది. కాబట్టి కాస్త ఎక్కువ నిద్రే అవసరం. వీరు నిద్రపోయే సమయంలో కనీసం పదిహేను నిమిషాలు తగ్గినా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవాల్సివస్తుంది. అదే గంటల తరబడి నిద్రని వాయిదా వేస్తూ పోతే ఒత్తిడి ఎక్కువవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.*

*నిద్రలేమితో బాధపడేవారు కొన్ని చిట్కాలను పాటిస్తే నిద్రరాకపోవడమన్న సమస్య ఉండదు. నిద్రలేమి వల్ల ఊబకాయం వచ్చే అవకాశాలు ఉంటాయి. పడుకునే సమయంలో కాఫీ, టీ సేవించ కూడదు. ఒకసారి టీ తాగితే దాని ప్రభావం మూడు గంటల వరకు ఉంటుంది. వాటిలో ఉండే కొన్ని రకాల పదార్థాలు సరైన నిద్రకు భంగం కలిగిస్తాయి.*

*మధ్యాహ్నం నిద్రపోవడం మానివేయాలి. ఈ నిద్ర రాత్రిపూట నిద్రని దెబ్బతీస్తుంది.*

*ప్రతిరోజు క్రమం తప్పకుండా కొన్ని ఆరోగ్యసూత్రాలను పాటిస్తే సక్రమమైన నిద్ర ఉంటుంది.ముఖ్యంగా ఎక్సర్‌సైజ్ చేయడం, క్రమం తప్పకుండా యోగా చేస్తే శరీరం ఫిట్‌గా ఉండటమే కాకుండా సుఖంగా నిద్రపోవడానికి కూడా సహాయం చేస్తుంది.*


*భోజనం చేసిన వెంటనే నిద్రపోవడం సరైన పద్ధతి కాదు. దానివల్ల తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక భోజనం చేసిన తర్వాత కొంతసమయం నడవడం వంటివి చేస్తే ఆరోగ్యానికి మంచిది.*

*భోజనవేళలను సరిగా పాటించాలి. లేకపోతే దీనివల్ల అజీర్ణం వంటి సమస్యలు తలెత్తి నిద్రమీద దాని ప్రభావం చూపుతుంది. అందుకే సమయానుకూలంగా భోజనం చేయడం ద్వారా నిద్రలేమిని కొంత వరకు అరికట్టవచ్చు.*

*ఆడవారు ఇంటి పనులు చేసి ఎక్కువగా అలసిపోతుంటారు. ఇటువంటి వారు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి.దానివల్ల వారికి మంచి నిద్ర పడుతుంది.*




# ఏయే సమయాల్లో మన శరీరంలో ఏమేం జరుగుతుందో తెలుసా...?!!



మనం అనేక రకాల పనులను నిత్యం టైం ప్రకారం చేస్తుంటాం. అయితే మనం ఏ పని చేసినా దానికి ఒక టైమంటూ ఉంటుంది. కానీ మన శరీరం కూడా ఒక నిర్దిష్టమైన సమయాన్ని పాటిస్తుందని మీకు తెలుసా? అవును, మీరు విన్నది నిజమే. మన శరీరం కూడా తనలో జరిగే జీవక్రియలకు ఒక్కో సమయాన్ని కేటాయిస్తుంది. ఆ సమయంలో ఆయా అవయవాలు యాక్టివ్‌గా పనిచేస్తాయి. దీనివల్ల మనం ఆరోగ్యంగా ఉంటాము. అయితే మన శరీర అవయవాలు యాక్టివ్‌గా ఉన్న సమయంలో వాటికి విరుద్ధంగా మనం చేసే కొన్ని పనుల వల్ల ఆయా భాగాలపై ఒత్తిడి పెరిగి మనకు అనారోగ్యం కలుగుతుంది.

- ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య సమయంలో పెద్ద పేగు యాక్టివ్‌గా ఉంటుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకి పంపే పనిలో అది మునిగి ఉంటుంది. కాబట్టి ఈ సమయంలో మనం ఎంత వీలైతే అంత ఎక్కువగా నీటిని తాగాలి. వాకింగ్, రన్నింగ్ వంటి వ్యాయామాలు చేయాలి. కాఫీ, టీ వంటివి అస్సలు తాగకూడదు.

- ఉదయం 7 నుంచి 9 మధ్య ప్రోటీన్లు, తక్కువ పిండి పదార్థాలు కలిగిన ఆహారం, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన ఆహారాన్ని, పండ్లను ఈ సమయంలో బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవాలి. దీనివల్ల మన శరీరానికి కావల్సిన పోషకాలు ఎక్కువగా ఉదయమే అందుతాయి.

- ఉదయం 9 నుంచి 11 మధ్య సమయంలో మన శరీరంలోని ప్లీహం ఉత్తేజంగా ఉంటుంది. అది మన శరరీంలో జరిగే జీవక్రియలను గాడిలో పెడుతుంది. ఉదయం మనం తిన్న ఆహారం నుంచి పోషకాలను శరీరం గ్రహించేలా చేస్తుంది.

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య సమయంలో మన గుండె ఉత్తేజంగా పనిచేస్తుంది. శరీర భాగాలకు రక్తం బాగా సరఫరా అయ్యేలా చూస్తుంది. దీని వల్ల శరీర కణాలకు శక్తి అందుతుంది.

- మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల సమయంలో చిన్నపేగులు అలర్ట్‌గా ఉండి బాగా పనిచేస్తాయి. మనం తిన్న బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌ల జీర?ప్రక్రియను ముగిస్తుంటాయి.

- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల సమయంలో మన మూత్రాశయం యాక్టివ్‌గా పనిచేస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకి పంపే పనిలో ఉంటుంది. ఈ సమయంలో నీరు ఎక్కువగా తాగాలి.

- సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల సమయంలో మన కిడ్నీలు బాగా చురుగ్గా పనిచేస్తాయి. రక్తాన్ని వడబోయడం, వ్యర్థాలను మూత్రాశయానికి పంపడం వంటి కార్యక్రమాలను చేస్తాయి.

- రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య సమయంలో పెరికార్డియం ఉత్తేజంగా ఉంటుంది. ఈ టైంలో రాత్రి భోజనాన్ని కచ్చితంగా ముగించాలి. మెదడు, ప్రత్యుత్పత్తి అవయవాలను పెరికార్డియం ఈ సమయంలో యాక్టివేట్ చేస్తుంది.


- రాత్రి 9 తర్వాత నుంచి 11 గంటల మధ్య సమయంలో భోజనం అస్సలు చేయకూడదు. థైరాయిడ్, అడ్రినల్ గ్రంథులు ఇప్పుడు బాగా పనిచేస్తాయి. ఇవి శరీర మెటబాలిజం ప్రక్రియను చురుగ్గా సాగేలా చేస్తాయి. శరీర ఉషో?గ్రతను క్రమబద్ధీకరిస్తాయి. కణాలకు శక్తి అందేలా చూస్తాయి.

- రాత్రి 11 నుంచి 1 గంట మధ్య సమయంలో మూత్రాశయం యాక్టివ్‌గా ఉంటుంది. గాల్ స్టోన్స్ వంటివి ఉన్నవారికి ఈ సమయంలో సాధారణంగా నొప్పి వస్తుంటుంది.

- రాత్రి 1 నుంచి ఉదయం 3 మధ్య సమయంలో కాలేయం చురుగ్గా ఉంటుంది. అప్పుడు మేల్కొని ఉంటే లివర్ పనితనం దెబ్బతింటుంది. కాబట్టి ఈ సమయంలో ఖచ్చితంగా నిద్రపోవాల్సిందే. లేదంటే కాలేయం సరిగ్గా పనిచేయదు. వ్యర్థాలు బయటికి వెళ్లవు.

- ఉదయం 3 నుంచి 5 మధ్యలో ఊపిరితిత్తులు యాక్టివ్‌గా ఉంటాయి. ఆ సమయంలో దగ్గు వస్తుందంటే ఊపిరితిత్తులు విష పదార్థాలను బయటకు పంపుతున్నాయని అర్థం చేసుకోవాలి.

# అల్లం నీటిని తాగండి.. సులభంగా బరువు తగ్గండి..!



గోదావరీ నదికి భారీగా వరదనీరు.. పెరిగిన నీటిమట్టం.. ప్రమాద హెచ్చరికలు దానిమ్మ తొక్కతో చుండ్రుకు చెక్... పండ్ల తొక్కలతో ఆరోగ్య ప్రయోజనాలెన్నో ! యూరో కప్ ఫైనల్ : ఓడిన ఫ్రాన్స్... జీర్ణించుకోలని ఫ్యాన్స్... ఈఫిల్ టవర్ వద్ద బీభత్సం! ఉప్పునీటితో ప్రయోజనాలెన్నో... బరువు కూడా తగ్గొచ్చు! విరాట్ కోహ్లీ తాగే నీరు లీటరు ఖరీదు రూ.600.. ఆ నీటి ప్రత్యేకత ఏంటి? సులువుగా బ్రువు తగ్గానికి నానా క్షాలు ప్డుతున్నారా...అయితే మ్న రోజూ వారీ డైట్‌లో చేసుకునే చిన్న చిన్న మార్పులు మంచి ఫలితాన్నిస్తుంది. నిత్యం వంటల్లో ఉపయోగించే ఆహారపదార్థాలతోనే సులువుగా బరువు తగ్గించుకోవచ్చు. ఘాటుగా ఉండే అల్లంలో ఎన్నో రకాలైన ఔషధ గుణాలున్నాయి. ఇందులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ వంటి ధర్మాలతోపాటు ఎన్నో రకాల విటమిన్స్, మినరల్స్, ఇతర పోషకాలు అల్లంలో ఉన్నాయి. అంతేకాదు అల్లంలో బరువు తగ్గించే, కొవ్వును కరిగించే గుణాలు కూడా ఉన్నాయని చాలామందికి తెలీదు. అల్లం నీటిని తాగితే సులభంగా బరువు తగ్గొచ్చుట. పొట్ట, నడుము, తొడల వంటి భాగాల్లో అధికంగా పేరుకుపోయిన కొవ్వును సులభంగా తగ్గించే గుణం అల్లంలో పుష్కలంగా ఉందట. ఈ క్రమంలో జింజర్ వాటర్‌ను ఎలా తయారు చేసుకోయాలో తెల్సుకుందాం... అల్లాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. అనంతరం ఆ ముక్కలను నీటిలో వేసి మరిగించాలి. ఇలా 10 నిమిషాలు మరిగించి వడకట్టుకోవాలి. ఇలా రెడీ చేసుకున్న నీటిని నిత్యం తాగుతుంటే సులభంగా పేరుకుపోయిన కొవ్వు కరగడం మొదలవుతుంది. అయితే కనీసం 1 లీటరు వర్కైనా జింజర్ వాటర్‌ను ప్రతిరోజు తాగాలి.

# షుగర్ ఎక్కువైతే అనర్థమే



రక్తంలో సుగర్ ఎక్కువయితే అది శరీరంలోని కణాల నుంచి నీటిని తీసుకుంటుంటుంది. దాంతో డిహైడ్రేషన్ కలుగుతుంది. అందుకే రక్తంలో సుగర్ ఎక్కువగా ఉన్నవాళ్లు డయాబెటిక్స్ దాహంతో బాధపడుతుంటారు. డయాబెటిస్ ఉన్నవాళ్లు ఆకలితో ఎందుకు అలమటిస్తుంటారంటే ఎంత తిన్నా జీర్ణమైన ఆహారం కణాలకు చేరదు కాబట్టి. వాటితోబాటు మూత్రానికి ఎక్కువసార్లు పోతున్నా, కారణం లేకుండా బరువు తగ్గిపోతున్నా, అలసట, నీరసం ఎక్కువగా ఉన్నా చూపు అలికినట్లున్నా, గాయాలై త్వరగా మానకుండా ఉన్నా, కాళ్లచేతుల్లో తిమ్మిర్లుగా ఉంటున్నా, వయసు 30 దాటుతున్నా రక్తపరీక్షల ద్వారా డయాబెటిస్ ఉన్నది లేనిది నిర్ధారణ చేసుకోవాలి. వ్యాధి ఉంటే వైద్యుల సలహా మేరకు జాగ్రత్తపడాలి.

డయాబెటిస్‌ని అదుపులో ఉంచుకోవాలి. లేకపోతే అనర్థాలు అధికం. డయాబెటిస్ జబ్బు కాదు గానీ అన్ని జబ్బులకు మూలం, అదుపులో ఉంచు కోకపోతే. ఆర్టెరీస్ రక్తనాళాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా సన్నటి రక్తనాళాలకు ముప్పు ఉంటుంది. ఈ రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఎక్కువ. అలా రక్తనాళాలలో కొవ్వు పేరుకుపోవడంవల్ల హార్ట్ ఎటాక్ లేక స్ట్రోక్‌లాంటివి రావచ్చు. పెద్ద రక్తనాళాలు మూసుకుపోయే ప్రమాదం ఉంది. కాళ్లలో రక్తనాళాలు దెబ్బతిని, గాంగ్రిన్ లాంటివి కలిగే ప్రమాదాలున్నాయి. అధిక రక్తపోటు కలగవచ్చు. అదీ గుండెకి ప్రమాదమే కదా? ఆహార నియంత్రణ చాలా అవసరం. కొవ్వు పదార్థాల్ని తగ్గించివేయాలి. కడుపునిండా తినకూడదు. ఖాళీ కడుపుతో ఉండకూడదు. నాలుగు గంటలకోసారి కొద్దికొద్దిగా తీసుకోవాలి. డయాబెటిస్‌తో నరాలు దెబ్బతింటాయి. నరాల మీద ఉండే పొర దెబ్బతినడంతో న్యూరోపతి వస్తుంది. రక్తనాళాలు దెబ్బతింటే, వాస్క్యులోపతి అంటారు. పాదవాటి రక్తనాళాలు దెబ్బతిన్నట్లే, పాదవాటి నరాలు దెబ్బతింటాయి. అందుకే పాదాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వారానికొకసారైనా గోరు వెచ్చని నీటిలో పాదాల్ని ఉంచి, తర్వాత శుభ్రంగా తుడవాలి. డయాబెటిస్‌వల్ల ఒక్కోసారి మూత్ర పిండాలు పూర్తిగా దెబ్బతినవచ్చు. డయాబెటిక్ వల్ల రెటినోపతి రావచ్చు. కళ్లలోని రెటీనా దెబ్బతినడంవల్ల ఇది వస్తుంది. ఇన్‌ఫెక్షన్స్ త్వరగా రావచ్చు. క్షణాల్లో వ్యాపించవచ్చు. అంగస్తంభన, నరాలు, రక్తనాళాలు దెబ్బతినడంవల్ల తగ్గి దాంపత్య జీవితం దెబ్బతింటుంది. నరాలు దెబ్బడంవల్ల నొప్పి లేకుండా గుండె నొప్పి లాంటివి వస్తాయి. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ అంటారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని డయాబెటీస్‌ని అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం.

# రింగురింగుల జుట్టుతో జాగ్రత్తసుమా!



రింగు రింగుల జుట్టు సాధారణంగా ఉండే జుట్టుకంటే పెళుసుగా ఉండటమేగాకుండా, పొటిపొడిగా ఉంటుంది.

కాబట్టి రింగుల జుట్టు ఉన్నవారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. రింగుల జట్టు ఉన్న వారు షాంపూతో వారానికి ఒక సారైనా తప్పకుండా తలస్నానం చేయాలి. దానివల్ల తలలో చర్మం, వెంట్రుకలు జిడ్డులేకుండా ఉంటాయి. తలస్నానానికి మాయిశ్చరైజింగ్ షాంపూ అయితే మరీ మంచిది. ఇది జుట్టు పొడిపొడిగా ఉంచేందుకు సహకరిస్తుంది. వారంలో వీలనైనన్ని సార్లు షాంపూతో తలస్నానంచేస్తే రింగుల జుట్టు జిడ్డులేకుండా ఆరోగ్యంగా ఉంటుంది. అయితే స్నానం చేసిన తరువాత రింగుల జుట్టును సహజంగానే గాలికి ఆరనివ్వాలి. అలాకాకుండా డ్రయ్యర్‌నుగనుక వాడితే జుట్టు విరిగిపోయే ప్రమాదం ఉంటుంది.


అసలే రింగు రింగులుగా ఉన్న జుట్టు మరింతగా రింగులు తిరగకుండా ఉండేందుకు యాంటిఫ్రిజ్ సిరమ్‌ను ఉపయోగించటం ఉత్తమం. ఈ సిరమ్‌ను జుట్టు కుదుళ్లనుంచీ రాస్తే సరిపోతుంది.



# చిత్రభాను

## కంటతడి పెట్టుకొన్న రణ్‌వీర్..

పద్మావతి ట్రైలర్‌కు వస్తున్న స్పందనతో చాలా ఆనందంగా ఉంది. దేశవ్యాప్తంగా అందరి నుంచి అనూహ్యం స్పందన వస్తున్నది. సోషల్ మీడియాలో ట్రైలర్ వైరల్‌గా మారింది అని బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ వెల్లడించారు. ట్రైలర్‌కు వస్తున్న స్పందన వస్తున్న నేపథ్యంలో రణ్‌వీర్ సింగ్ సోషల్ మీడియాలో ఏమన్నారంటే.. పద్మావతి ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ఈ చిత్రంలో నేను పోషించిన సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్రకు ఫ్యాన్స్, ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తున్నది. నాపై కురిపిస్తున్న ప్రేమకు ధన్యవాదాలు. ట్రైలర్‌లో నా పాత్రపై మీరు కురిపిస్తున్న అభిమానానికి ధన్యవాదాలు. నన్ను అంతగా ప్రేమిస్తున్న ప్రతీ ఒక్కరికి నా థ్యాంక్స్. అనూహ్యమైన స్పందన చాలా అదుతేంగా ఉంది. నాపై కురిపిస్తున్న ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటాను. సంజయ్ లీలా భన్సాలీ నా గురువు లాంటివాడు. ట్రైలర్‌నే కాదు సినిమాను రూపొందించిన తీరు ఆయన ప్రతిభకు అద్ధం పట్టింది. పద్మావతి చిత్రం బాలీవుడ్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుంది. ఎన్ని సమస్యలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో నిలుచున్నాడు అని భన్సాలీపై ప్రశంసలు కురిపించాడు. అంతేకాకుండా సంజయ్ సర్. నీవు అంటే చెప్పలేనంత ఇష్టం. నీవు అదుతేమైన ఫిల్మ్ మేకర్. సినిమా కోసం ఎన్నో త్యాగాలు చేశాడు. అనేక అవమానాలు ఎదుర్కొన్నావు. ట్రైలర్‌కు వస్తున్న స్పందనతో మీ క ృషికి తగిన ఫలితం దక్కింది అని రణ్‌వీర్ పేర్కొన్నారు. పద్మావతి సినిమా షూటింగ్ మా అందరికీ ఓ గొప్ప అనుభూతిని మిగిల్చింది. చివరి షెడ్యూల్ ముగిస్తున్న సమయంలో మేమంత ఉద్వేగానికి గురయ్యాం. ఓ దశలో కంటతడి పెట్టుకొన్నాం. జీవితంలో మరిచిపోలేనటువంటి మెమొరీని పద్మావతి చిత్రం ఇచ్చింది. పద్మావతి చిత్ర షూటింగ్ సందరరేగా దీపికా పదుకొనే చూపించిన ప్రేమ, అందించిన సహకారం చాలా గొప్పది. అందుకు నేను హ ృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఖిల్జీగా రణ్‌వీర్, రాణి పద్మావతిగా దీపికా పదుకొనే, మహర్వాల్ రతన్ సింగ్ పాత్రలో షాహిద్ కపూర్ నటిస్తున్నారు. ఎన్నో ఘనతలు, మధురానుభూతులు ఉన్న పద్మావతి చిత్రం. అలాంటి చిత్ర ట్రైలర్‌కు వస్తున్న రెస్పాన్స్ ఆమోఘం ఉంది. నా లుక్‌కు



వస్తున్న రెస్పాన్స్ చూస్తే ఆనందబాష్పాలు రాలుతున్నాయి అని రణ్‌వీర్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెలిపారు. డిసెంబర్ 1న రిలీజ్ అవుతున్న ఈచిత్రంలో అదితిరావు హైదరీ, జిమ్ సర్బా, రాజా మురాద్ తదితరులు నటించారు.

## డబ్బులు నీళ్లలా....

### రోబో 2.0 ఆడియో వేడుక





ఇండియాలో ఇప్పటి వరకు భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమా ఏది అంటే అందరూ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి' పేరే చెబుతారు. అయితే త్వరలోనే ఈ అభిప్రాయం మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. బాహుబలి ప్రాజెక్టును మించిన సినిమాగా రజనీకాంత్ రోబో 2.0 సినిమా అవతరించేలా ఉంది. దాదాపు రూ. 400 కోట్ల పైచిలుకు బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రమోట్ చేయడానికి కూడా భారీగానే ఖర్చు చేస్తున్నారు. గతేడాది నంబర్లో 2.0 సినిమా లాంచింగ్ కార్యక్రమం ముంబైలో గ్రాండ్ గా నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని మీడియా సంస్థలను, విదేశీ మీడియా సంస్థలను సైతం ఆహ్వానించి రూ. 6 కోట్లు ఖర్చు పెట్టి లాంచింగ్ ఘనంగా నిర్వహించారు. రోబో 2.0 సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా ప్రమోషన్లో భాగంగా ఆడియో రిలీజ్ వేడుక ఈనెల 27న దుబాయ్‌లో గ్రాండ్ గా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. యావత్ ప్రపంచం ద ృష్టి తమ సినిమాపై పడేలా దుబాయ్‌లో ఈ వేడుక నిర్వహించబోతున్నారు. రోబో 2.0 ఆడియో వేడుక కోసం డబ్బులు నీళ్లలా ఖర్చు పెడుతున్నారు. ఈవెంటును రూ. 12 కోట్ల ఖర్చుతో నిర్వహించబోతున్నట్లు సమాచారం. ఇంత భారీ ఎత్తున నిర్వహించడం వెనక భారీ మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఉన్నాయని తెలుస్తోంది. 3డి ఎఫెక్టులతో ఈ సినిమా ఇండియన్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించనుంది. ఇండియాలో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 3డి సినిమా ఇది. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి త్రీడీ మేకింగ్ వీడియోను విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. దర్శకుడు శంకర్ మాట్లాడుతూ... ''ఏదో పేరు కోసం 3డిలో ఈ సినిమా చేయలేదు. ఈ సినిమా స్క్రిప్ట్‌కు 3డి టెక్నాలజీ అవసరం అయింది. దానికి తగిన విధంగా స్క్రిప్టును సిద్ధం చేయడం జరిగింది. హాలీవుడ్ ఫిల్మ్స్ లో చాలా వరకు 2డి షూట్ చేసి ఆ తర్వాత వాటిని పోస్టు ప్రొడక్షన్ లో 3డిలోకి మార్చుతారు.

## ద్యా..వుడా..! ఏందీ బీభత్సం...?

నేహా భాసిన్ సౌత్ ఇండస్ట్రీ గాయణీ మణుల్లో ఈమెది ఒక వెరైటీ పద్ధతి, దాదాపుగా దక్షిణాది సినీతారలు తప్ప సింగర్స్ పొట్టి బట్టల్లో కనిపించటం అరుదే. కానీ నేహా మాత్రం బికినీల్లో కూడా రెచ్చిపోతుంది. సూపర్‌స్టార్ నటించిన '1' నేనొక్కడినే చిత్రంలో ''అవ్ తుజే మోహ్ కర్తా'' పాటతో మహేశ్ అభిమానుల్ని ఉర్రూతలూగించిన సింగర్ నేహా భాసిన్ బికినీలో ఫొటోలకు పోజులివ్వడం నేహా భాసిన్‌కి కొత్తేమీ కాదు. ఈ విషయాన్ని ఆమే స్వయంగా చెబుతోంది. 'బికినీ నాకు కొత్త కాదు.. హీరోయిన్లతో పోటీ పడే అందం నాది.. ఛాన్సిచ్చి చూడండి.. తెరపై ఏ స్థాయిలో రెచ్చిపోతానో..' అంటోంది నేహా భాసిన్. హాట్ హాట్ ఫొటోలతో నేహా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె ఇన్‌స్టాగ్రాం నిండా ఇలాంటి ఫొటోలే కనిపిస్తాయి. గ్లామర్ ఉంది చూపించడానికే అన్నంతగా ఉండే ఈమె ఫొటోలు ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. బాలీవుడ్‌లో హీరోయిన్లకు సంబంధించి ఈ బికినీ ఫొటోల ట్రెండ్ పరమ రొటీన్. వయసు మీద పడ్డా, వన్నె తరగని అందం.. అన్పించుకోవడానికి ఎందరో సీనియర్ భామలు కూడా బికినీ ఫొటోల్ని తమంతట తాముగా సోషల్ మీడియాలో పెడ్తుంటారు. అలాంటప్పుడు, నేహా భాసిన్ బికినీ ఫొటోల్ని సోషల్ మీడియాలో పెట్టడం వింతెలా అవుతుంది.? ఇటీవల ఆమె పోస్ట్ చేసిన ఓ ఫొటోపై మిశ్రమ స్పందన వస్తుంది. కొందరు ఏం అందం అంటూ పొగుడుతుంటే, మరికొందరు మాత్రం నేహా హద్దులు దాటుతోందంటూ విమర్శిస్తున్నారు. అయితే విమర్శలను ఏ మాత్రం పట్టించుకోకుండా నేహా భాసిన్ మాత్రం తన పద్ధతిలో తాను రెచ్చిపోతూనే ఉంది...

గ్లామర్ తళుకులతో బాలీవుడ్‌తో పాటు దక్షిణాదిలో చక్కటి అవకాశాల్ని సొంతం చేసుకుంటున్నది పూజా హెగ్డే. తాజాగా డీజే దువ్వాడ జగన్నాథం చిత్రంలో అల్లు అర్జున్‌తో జోడీ కట్టిన ఆమె త్వరలో మహేష్‌బాబుతో ఓ సినిమా చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు చదువుపై ద ృష్టిసారిస్తున్నది ఈ సొగసరి. త్వరలో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆమె విదేశాలకు పయనమవుతున్నట్లు తెలిసింది. డీజే దువ్వాడ జగన్నాథం తరువాత సినిమాలకు స్వల్ప విరామం ప్రకటించి చదువుపై ద ృష్టిసారించాలని ఆమె నిర?యించుకున్నట్లు తెలిసింది. ఆంథ్రోపాలజీలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ చేయనున్నట్లు సమాచారం.

## మళ్లీ కాలేజీకి...!




## నాలుగోసారి తండ్రి అయిన పవర్ స్టార్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరోసారి తండ్రి అయ్యార్డు. మూడోభార్యకి రెండోకాన్పులో మగబిడ్డ పుట్టటం తో ఆ పసివాన్ని చేతుల్లోకి తీసుకొని మురిసి పోతున్నాడు పవర్ స్టార్. విశాఖలో సత్యానంద్ దగ్గర యాక్టింగ్ కోచింగ్ తీసుకుంటున్నప్పుడు... పవన్ కు నందిని పరిచయమైంది. అలా మొదలైన వారి పరిచయం... పెళ్లి వరకు వెళ్లి చివరకు విడాకులతో ముగిసింది. అప్పట్లో ఈ వ్యవహారం సంచలనం రేకెత్తించింది. వీరిద్దరి వ్యవహారం కోర్టు వరకు వెళ్లింది. అనంతరం వీరిద్దరూ విడాకులు తీసుకున్నారు. అనంతరం బద్రి సినిమాలో నటించిన రేణూ దేశాయ్ తో పీకల్లోతు ప్రేమలో పడిపోయాడు పవర్ స్టార్. వీరిద్దరికీ పెళ్లికాకుండానే అకీరా అనే కుమారుడు కూడా పుట్టాడు. అనంతరం కొడుకు సమక్షంలో వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. వీరిద్దరి సంసారం కొన్నాళ్లు సజావుగా సాగిన తర్వాత... ఇద్దరి మధ్య పొరపొచ్చాలు వచ్చాయి. తర్వాత ఇద్దరూ విడిపోయారు. తర్వాత వరుస సినిమాలతో పవన్ బిజీ అయ్యాడు. తీన్ మార్ సినిమా సమయంలో పవన్ మళ్లీ ప్రేమలో పడ్డారు. అన్నా లెజెనోవా అనే విదేశీ నటి, రష్యన్ మోడల్ ని ప్రేమించి చివరకు పెళ్లి చేసుకున్నాడు. తీన్ మార్ సినిమాలో రష్యా మోడల్ అన్నా లెజెనోవా పవన్ తో కలిసి పనిచేసింది. ఈ పరిచయం ప్రేమ వరకు వెళ్లి చివరకు పెళ్లితో ముగిసింది. ఇది పవన్ కు మూడో పెళ్లి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ భార్య అన్నా లెజ్ నోవా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ కు



ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్న సంగతి తెలిసిందే. రేణు దేశాయ్‌తో వివాహానంతరం వీరికి అకీరా, ఆధ్య జన్మించారు. అనంతరం రేణుతో విడిపోయాక పవన్ రష్యాకు చెందిన అన్నాను వివాహం చేసుకున్నాదు. వీరిద్దరికీ ఇంతకు మునుపే పొలెనా అనే పాప ఉంది. ఇప్పుడు బాబు పుట్టాడు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో అన్నా లెజొనెవాకు కాన్పు జరిగింది. ఆసుపత్రిలో బాబును ఎత్తుకుని మురిపెంగా చూస్తున్న పవన్ ఫొటో ఒకటి బయటకు వచ్చింది. తమ ఇంటికి మరో చిన్నారి రాకతో పవన్ చాలా హ్యాపీగా కనిపిస్తున్నాడు.



గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం
నానాజీ దేశ్‌ముఖ్
(11 అక్టోబరు, 1916 - 27 ఫిబ్రవరి, 2010)
శత జయంతోత్సవములు
నరేంద్ర మోడీ
ప్రధానమంత్రి
గ్రామీణ జీవనం మరియు సాంకేతికతపై
ప్రదర్శన
11 అక్టోబరు, 2017
ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
(ఐఎఆర్ఐ),
మేళా గ్రౌండ్, పూస, న్యూఢిల్లీ
విశిష్ట అతిథి
నరేంద్ర మోడీ
ప్రధానమంత్రి
" నేను నా కోసం కాదు నా సొంత వారి కొరకు జీవిస్తాను, నా సొంత వారు ఎవరంటే అణగారిన మరియు నిర్లక్ష్యం చేయబడిన వారు "
నానాజీ దేశ్‌ముఖ్
కార్యక్రమం
గ్రామీణ జీవనం మరియు సాంకేతికతపై ప్రదర్శన
DISHA
దిశ పోర్టల్ మరియు గ్రామ్ - సంవాద్ (ప్రజా సమాచార యాప్)
RSETI
Rural Self Employment Training Institutes
Powering Rural Entrepreneurship
11 ఆర్ఎస్ఇటిఐ భవనాలు ప్రారంభం
నానాజీ దేశ్‌ముఖ్ ప్లాంట్ ఫినామిక్స్ సెంటర్, ఐఎఆర్ఐ
నానాజీ దేశ్‌ముఖ్ స్మృతిగా తపాలా స్టాంపు విడుదల
కార్యక్రమపు ప్రత్యక్ష వెబ్‌కాస్ట్ ప్రసారం http://webcast.nic.in/mord లో జరుగును/వెబ్‌సైటు: www.rural.nic.in
DDU-GKY
AAJEEVIKA
Mission Antyodaya
SAANJHI
NSAP
davp 35101/13/0027/1718